అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు
ప్రచురించబడును.
సంప్రదించండి
93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం
తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

అక్షరకలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల
వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు,
యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ :
93962 18955

సంపుటి : 17 సంచిక : 236 | 06-10-2025 సోమవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00



## గ్రీన్ జర్నీ పేరుతో ప్రజల రక్తం పీలుస్తున్నారు..

ప్రభుత్వంపై కవిత తీవ్ర విమర్శలు

సీఎం రేవంత్‌రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శలు

రాష్ట్రంలో బస్సు చార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి

గ్రీన్ జర్నీ పేరుతో ప్రభుత్వం సామాన్యులను దోచుకుంటోందని ఆరోపణ

బస్సు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితి కల్పిస్తున్నారని మండిపాటు

సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సామాన్య ప్రజలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకంత కోపమని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు."గ్రీన్ జర్నీ పేరుతో ప్రభుత్వం సామాన్యుల రక్తాన్ని పీల్చేస్తోంది. బస్సు ఎక్కడమే పాపం అన్నట్లుగా ప్రజల జేబులను గుల్ల చేస్తున్నారు" అని కవిత తన పోస్టులో తీవ్రంగా విమర్శించారు. ఇటీవలే బస్సు పాస్‌ల ధరలను పెంచి చిరుద్యోగులు, విద్యార్థులపై పెనుభారం మోపిన ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా బస్సు చార్జీలను అమాంతం పెంచేయడం దారుణమని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు సామాన్యుడి నడ్డి విరిచేలా ఉన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణాను ప్రజలకు దూరం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## పత్తి రైతులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

- రాబోయే వారంలోపే సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తామన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సీసీఐ ప్రతినిధులు, మిల్లర్లతో ఈ నెల 6న మరోసారి సమావేశమవుతామని వెల్లడి
- రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించమన్న మంత్రి తుమ్మల

తెలంగాణ పత్తి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాబోయే వారంలోనే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. తన నివాసంలో పత్తి కొనుగోళ్ల అంశంపై నిన్న సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, ప్రస్తుతం కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంపై కీలక వ్యాఖ్యలు చేశారు.



2 లో..

## బస్సు చార్జీల పెంపు దారుణం: రేవంత్

## సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

సిటీ బస్సు చార్జీల పెంపుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

ఒక్కసారే రూ.10 పెంచడం దుర్మార్గమైన నిర్ణయమన్న కేటీఆర్

హైదరాబాద్ ప్రజలపై సీఎం కక్షగట్టారని విమర్శ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



జంట నగరాల్లో సిటీ బస్సు చార్జీలను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక్కసారి కనీస చార్జీని ఏకంగా 10 రూపాయలు పెంచడం దుర్మార్గమని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో బస్సు చార్జీలు పెంచడం వల్ల ప్రతి ప్రయాణికుడిపై నెలకు అదనంగా 500 రూపాయల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కనీస చార్జీపై ఏకంగా 50 శాతం పెంచడం దారుణమని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల బస్ పాస్ చార్జీలు, టీ–24 టికెట్ ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రజలపైనా భారం మోపుతోందని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం విఫలమవడం వల్లే ఆర్టీసీ దివాళా తీసిందని, ఇప్పుడు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. రాజధాని వాసులపై రోజుకు కోటి రూపాయల భారం మోపే ఈ నిర్ణయం, హైదరాబాద్ ప్రజలపై ముఖ్యమంత్రికి ఉన్న కక్షను స్పష్టం చేస్తోందని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.



2 లో..

## మోదీ, రేవంత్.. 'బడే భాయ్, చోటా భాయ్': హరీశ్ రావు



2 లో..

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ కోటా సీట్లపై హరీశ్ రావు స్పందన

ఏపీలో 85 శాతం లోకల్ రిజర్వేషన్ ఉందని గుర్తు చేసిన హరీశ్

ప్రస్తుత పీజీ నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఆరోపణ

## డిజిటల్ ప్రపంచంలో మహిళలు

## అప్రమత్తంగా ఉండాలి: సీపీ సజ్జనార్

మహిళలకు హైదరాబాద్ కొత్త సీపీ సజ్జనార్ కీలక సూచన

ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని స్పష్టీకరణ

మోసగాళ్లు వాటిని సులభంగా దుర్వినియోగం చేస్తారని వెల్లడి

ఎవరినైనా నమ్మేముందు ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని సలహా

జిటో కనెక్ట్ 2025లో మహిళా పారిశ్రామికవేత్తలతో సీపీ భేటీ

2 లో..



## విజయ్ ప్రచార రథం సీజ్ చేసిన పోలీసులు

విజయ్ కరూర్ సభలో తీవ్ర విషాదం.. 41 మంది మృతి

సభకు ముందే ప్రచార రథం కిందపడి ఇద్దరికి గాయాలు
రోడ్డు ప్రమాదం ఘటనలో విజయ్ ప్రచార వాహనం సీజ్

ఇటీవల తమిళనాడులోని కరూర్ ప్రాంతంలో ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ నిర్వహించిన సభలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది మరణించగా, 80 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తమ విచారణను వేగవంతం చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే, విజయ్‌కు మరో షాక్ తగిలింది. కరూర్ సభ జరగడానికి కొన్ని గంటల ముందు విజయ్ ప్రచార రథం ఇద్దరు యువకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తాజాగా ఆ ప్రచార రథాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను విచారిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# మోదీ, రేవంత్.. 'బడే భాయ్, చోటా భాయ్': హరీశ్ రావు

**తెలంగాణను మోసం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని విమర్శ**

**కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపారని ఆరోపణ**

**తెలంగాణకు బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష అని స్పష్టం**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరూ 'బడే భాయ్, చోటా భాయ్' అని, తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో వారిద్దరిదీ ఒకే తీరని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకరిది మోసపు చరిత్ర అయితే, మరొకరిది ద్రోహపు చరిత్ర అని, ఈ రెండు పార్టీలు తెలంగాణ పాలిట శత్రువులని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడుతూ, "కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు కృతజ్ఞత కూడా చూపలేదు. నల్లధనం తెచ్చి రూ.15 లక్షలు ఇస్తామన్న హామీ, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న మాట ఏమైంది?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. రూ.350 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200కు, రూ.65 ఉన్న పెట్రోల్‌ను రూ.100కు పెంచింది బీజేపీ కాదా? అని నిలదీశారు. ఎన్నికలు రాగానే ధరలు తగ్గించినట్లు డ్రామాలు ఆడి, ఎన్నికలు ముగియగానే మళ్లీ పెంచి ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. "నమ్మి ఓటేసిన ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి నట్టేట ముంచుతున్నారు. కేసీఆర్ హయాంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు నేడు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియాను సకాలంలో అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని దుయ్యబట్టారు. తెలంగాణ రైతులంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్నచూపని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా పరిషత్‌తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు. కష్టకాలంలో తెలంగాణకు కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మాత్రమే శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు.

# పత్తి రైతులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

**రాబోయే వారంలోపే సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తామన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**సీసీఐ ప్రతినిధులు, మిల్లర్లతో ఈ నెల 6న మరోసారి సమావేశమవుతామని వెల్లడి**

**రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించమన్న మంత్రి తుమ్మల**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ పత్తి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాబోయే వారంలోనే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. తన నివాసంలో పత్తి కొనుగోళ్ల అంశంపై నిన్న సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, ప్రస్తుతం కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**సీసీఐ, మిల్లర్లతో సమావేశం – ఈ నెల 6న మరోసారి చర్చ**

ఈ నెల 6వ తేదీన సీసీఐ సీఎండీ, కాటన్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో మరోసారి సమావేశమవుతానని మంత్రి వెల్లడించారు. జిన్నింగ్ మిల్లులు సీసీఐ టెండర్లలో పాల్గొనకపోవడం వల్ల కొనుగోళ్ల ప్రక్రియలో ఏర్పడిన సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని తెలిపారు. సీసీఐ అధికారులు, మిల్లర్లతో సచివాలయంలో రెండు దఫాలు సమావేశం నిర్వహించినట్లు మంత్రి చెప్పారు.

**"రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం"**

అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదన్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి హెచ్చరించారు. "రాబోయే వారం రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పత్తి కొనుగోళ్లు ప్రారంభం కావాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు.

**గత సీజన్ విధానాలే కొనసాగింపు – సడలింపులపై చర్చ**

గత సంవత్సరం అమలు చేసిన విధానాలను ఈ సీజన్‌లోనూ కొనసాగించాలని మిల్లర్లకు సూచించామని మంత్రి తెలిపారు. లింట్ శాతం, ఎల్–1 స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ వంటి అంశాలపై అభ్యంతరాలు వచ్చినా, కొన్ని నిబంధనల్లో సడలింపులు ఇచ్చి, మిగతావన్నీ యథాతథంగా అమలు చేస్తామని సీసీఐ అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

**పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ కోటా సీట్లపై హరీశ్ రావు స్పందన**

**ఏపీలో 85 శాతం లోకల్ రిజర్వేషన్ ఉందని గుర్తు చేసిన హరీశ్**

**ప్రస్తుత పీజీ నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్**

**ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఆరోపణ**

తెలంగాణలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న స్థానిక విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో సగం రాష్ట్ర కోటా కింద భర్తీ అవుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర కోటాలోని 25 శాతం, అంటే సుమారు 450 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయని వెల్లడించారు. అయితే, ఈ సీట్లలో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించకపోవడంతో అవన్నీ ఓపెన్ కేటగిరీలో ఇతర రాష్ట్రాల వారికి దక్కుతున్నాయని హరీశ్ రావు తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తే, 450 సీట్లలో కేవలం 68 సీట్లు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళతాయని, మిగిలిన 382 సీట్లు తెలంగాణ విద్యార్థులకే లభిస్తాయని ఆయన వివరించారు. ప్రస్తుత విధానం వల్ల మన విద్యార్థులు ఈ విలువైన అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాల కోసం కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, 2014 తర్వాత స్థాపించిన కాలేజీల్లో 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను స్థానికులకే కేటాయించామని హరీశ్ రావు తెలిపారు. దీనివల్ల ఏటా 1,820 అదనపు ఎంబీబీఎస్ సీట్లు మన విద్యార్థులకు దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, తెలంగాణ విద్యార్థుల హక్కులను కాపాడేలా కొత్త జీవో జారీ చేయాలని తన లేఖలో కోరారు.

# డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి: సీపీ సజ్జనార్

**మహిళలకు హైదరాబాద్ కొత్త సీపీ సజ్జనార్ కీలక సూచన**

**ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని స్పష్టీకరణ**

**మోసగాళ్లు వాటిని సులభంగా దుర్వినియోగం చేస్తారని వెల్లడి**

**ఎవరినైనా నమ్మేముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సలహా**

**జిటో కనెక్ట్ 2025లో మహిళా పారిశ్రామికవేత్తలతో సీపీ భేటీ**

డిజిటల్ ప్రపంచం ఓ మాయాజాలం... ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అంతే స్థాయిలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి... ముఖ్యంగా మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. నగరంలో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళా పారిశ్రామి కవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. "చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తున్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. "ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారు. "వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం" అని ఆయన ప్రశంసించారు. అక్టోబర్ 3న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ జిటో కనెక్ట్ 2025 ప్రదర్శన మూడు రోజుల పాటు సాగనుంది. ఇందులో 600కు పైగా స్టాళ్లు, ఆరు భారీ అరీనాలు ఏర్పాటు చేశారు. బిల్డ్ మార్ట్, బిజినెస్ బే, ప్రాపర్టీ పెవిలియన్ వంటి విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బాబా రాందేవ్, కమలేశ్ పటేల్ (దాదాజీ), సినీ నటుడు బొమన్ ఇరానీ, క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.




# ఆధ్యాత్మిక యాత్రలో రజనీకాంత్... ప్రశాంతత కోసం మళ్లీ హిమాలయాలకు!

**జైలర్ 2' షూటింగ్‌కు ముందు వారం రోజుల విరామం**

**రిషికేశ్, బద్రీనాథ్‌తో పాటు మహావతార్ బాబాజీ గుహ సందర్శన**

**ప్రతి ఏటా ఇక్కడికి రావడం తన ఆనవాయితీ అని వెల్లడి**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రజినీ యాత్ర ఫొటోలు**

ఒక భారీ చిత్రం షూటింగ్ పూర్తిచేసి, మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును మొదలుపెట్టే ముందు మానసిక ప్రశాంతత కోసం సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుంటారని తెలిసిందే. తన ఆనవాయతీని కొనసాగిస్తూ ఆయన మరోసారి హిమాలయ యాత్ర చేపట్టారు. 'కూలీ' చిత్రం చిత్రీకరణను ఇటీవల ముగించుకున్న ఆయన, 'జైలర్ 2' షూటింగ్ ప్రారంభానికి ముందు వారం రోజుల పాటు హిమాలయాల్లో గడపనున్నారు. ఈ యాత్రలో భాగంగా రజినీకాంత్ రిషికేశ్‌లోని ఆశ్రమంలో బస చేస్తూ బద్రీనాథ్, మహావతార్ బాబాజీ గుహ వంటి పవిత్ర స్థలాలను దర్శించుకున్నారు. హిమాలయాల ప్రకృతి సౌందర్యం నడుమ ఆయన ధ్యానంలో ఉన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎంతో సింపుల్ గా ఉన్న రజనీ... రోడ్డు పక్కన అల్పాహారం తీసుకుంటూ కనిపించారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ, "ప్రతి సంవత్సరం ఇక్కడికి రావడం వల్ల ఒక కొత్త అనుభవం లభిస్తుంది. ప్రపంచమంతటికీ ఆధ్యాత్మికత చాలా అవసరం. అదే మనిషికి తృప్తిని, ప్రశాంతతను ఇస్తుంది" అని పేర్కొన్నారు. భగవంతుడిపై విశ్వాసం జీవితంలో సమతుల్యతను అందిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటించిన 'కూలీ' సినిమా తర్వాత రజినీ, 'జైలర్'కు దర్శకత్వం వహించిన నెల్సన్ దిలీప్‌కుమార్‌తో 'జైలర్ 2' చేయనున్నారు. ఈ విరామంలో శారీరకంగా, మానసికంగా నూతన శక్తి పొందడానికే ఆయన ఈ యాత్రను ఎంచుకున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. మహావతార్ బాబాజీని రజినీకాంత్ ఎంతగానో ఆరాధిస్తారన్న విషయం తెలిసిందే. ఆయన ప్రేరణతోనే 'బాబా' సినిమా తీశారు. ఈసారి కూడా బాబాజీ గుహలో కొంత సమయం ధ్యానం చేసి ఆధ్యాత్మిక శాంతిని పొందారని ఆయన సన్నిహితులు తెలిపారు. యాత్ర ముగించుకుని చెన్నైకి తిరిగి వచ్చిన తర్వాత రజినీకాంత్ 'జైలర్ 2' చిత్రీకరణలో పాల్గొంటారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# నా చిన్ననాటి స్నేహితురాలు ఈ రోజు పుట్టెడు దు:ఖంలో ఉంది: కవిత

**కల్వకుంట్ల కవిత చిన్ననాటి స్నేహితురాలి భర్త ఆకస్మిక మృతి**

**రెండు వారాల క్రితం చింతమడకలో ఆనందంగా బతుకమ్మ ఆడిన స్నేహితురాలు**

**అంతలోనే విషాదం**

**ఈ ఘటన పట్ల కవిత ప్రగాఢ సానుభూతి, దిగ్భ్రాంతి**

**స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలబడతానని భరోసా**

తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత చిన్ననాటి స్నేహితురాలి భర్త అకాల మరణం చెందారు. ఈ ఆకస్మిక ఘటన పట్ల కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన స్నేహితురాలికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెండు వారాల క్రితం చింతమడకలో తన స్నేహితురాలు ఎంతో ఉత్సాహంగా, సంబురంగా బతుకమ్మ ఆడిందని కవిత గుర్తు చేసుకున్నారు. ఇప్పుడామె పుట్టెడు దుఃఖంలో ఉందని విచారం వ్యక్తం చేశారు. విధి బలీయమైనదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం తన తోడుగా ఉండాల్సిన భర్త దూరం కావడంతో స్నేహితురాలు అనుభవిస్తున్న బాధ వర్ణనాతీతమని ఆమె పేర్కొన్నారు. ఈ కష్టం నుంచి తన స్నేహితురాలు, ఆమె కుటుంబ సభ్యులు త్వరగా బయటపడాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని కవిత తెలిపారు. స్నేహితురాలిగా ఈ విషాద సమయంలో ఆమెకు భరోసాగా, అండగా నిలబడటం తన బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. మరణించిన స్నేహితురాలి భర్త ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కోరారు. ఈ మేరకు కవిత సోషల్ మీడియాలో స్పందించారు.



# పంటకు పెట్టుబడేది

## జిల్లా వ్యాప్తంగా 5.42 లక్షల మంది రైతులు.. రావాల్సినది రూ.624 కోట్లు

## ఇప్పటి వరకు ఇచ్చింది 1.14 లక్షల మందికి రూ.26.94 కోట్లు మాత్రమే..

యాసంగి సీజన్ రైతు బంధు సాయం కోసం రైతాంగం ఎదురు చూస్తున్నది. సీజన్ ఇప్పటికే ప్రారంభం కాగా కొత్త ప్రభుత్వం ఈ నెల 10 నుంచి పెట్టుబడి సాయం ఇవ్వడం షురూ చేసింది. కానీ.. అందరికీ డబ్బులు పడకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. జిల్లాలో 5.42 లక్షల మంది రైతులకు రూ.624 కోట్ల పెట్టుబడి సాయం రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 1.14 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.26.94 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. గత యాసంగిలో కేసీఆర్ ప్రభుత్వం తొలి రోజే 1.41 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.43 కోట్లు జమ చేయగా.. ఈ సారి పది రోజులైనా రూ.26కోట్లు మాత్రమే రైతుల అందాయి.

### పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం..

పంట పెట్టుబడి కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో ఎకరానికి 5 వేల రూపాయలు రైతులందరి ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. ఈ యాసంగి సీజన్‌కు కూడా రైతు బంధు ఇచ్చే ప్రయత్నం చేయగా, కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. అయితే.. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.7500 చొప్పున ఏడాదికి రూ.15వేలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దాన్ని అమలు చేయడంలేదు. పాత పద్ధతిలోనే ఎకరానికి రూ.5వేలు ఇస్తున్నది. ఈ నెల 3న కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఈ నెల 10నుంచి రైతు బంధు ఇస్తామని చెప్పి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం ప్రారంభించింది. కానీ.. జిల్లా వ్యాప్తంగా 5,42,406 మంది రైతులకు రూ.624,14,84,629 పెట్టుబడి సాయం ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 1,14,542 మంది రైతులకు రూ.26,94,65,516 మాత్రమే జమ చేసింది. ఒక గుంట జాగా నుంచి ప్రారంభం చేసి ఇప్పటి వరకు ఎకరం భూమి ఉన్న వారికి జమ చేసినట్లు తెలుస్తున్నది.

### గత యాసంగిలో తొలి రోజే రూ.43 కోట్లు..

కేసీఆర్ ప్రభుత్వం గత యాసంగి సీజన్‌లో తొలి రోజే రూ.43కోట్లు రైతుల ఖాతాల్లో రైతు బంధు జమ చేయగా.. ఈ సారి పది రోజులైనా రూ.26కోట్లు మాత్రమే పడ్డాయి. అప్పుడు మొత్తం 1.41 లక్షల మందికి 86,531 ఎకరాలకు సంబంధించి రైతు బంధు ఇచ్చింది. ఇప్పుడు ఈ పది రోజుల్లో 1.14 లక్షల మందికి 52,500 ఎకరాలకు మాత్రమే పడ్డాయి. దాంతో గత యాసంగిలో బీఆర్ఎస్ ప్రభుత్వం జమ చేసిన రైతు బంధు కంటే ఈ సారి చాలా ఆలస్యంగా రైతుల ఖాతాల్లో జమ అవుతుండటంతో తమకు ఎప్పుడు వస్తాయోనని పెద్ద రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల ఖాతాల్లో రూ.26.94 కోట్లు జమయాసంగి సీజన్‌కు సంబంధించి రైతు బంధు డబ్బును ప్రభుత్వం ఈ నెల 10నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది. జిల్లాలో 5,42,106 మంది రైతులకు పెట్టుబడి సాయం రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,14,542 మంది ఖాతాల్లో రూ.26,94,65,516 జమ అయ్యాయి. మిగిలిన రైతులకు కూడా వేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. గతంలో వేసిన విధంగానే ఈ సారి కూడా ఎకరానికి ఐదు వేల రూపాయల చొప్పున జమ అవుతున్నాయి.

### రైతు బంధు కోసం ఎదురుచూస్తున్న

నేను ఐదెకరాల్లో పొలం పెట్టా. విత్తనాల కోసం కావాల్సిన డబ్బులు బయట తీసుకొచ్చినప్పటికీ ఇంకా నాటు వేసిన కూలోల్లకు ఇవ్వలేదు. దాంతోపాటు ఎరువులకు కూడా డబ్బులు కావాలి. రైతు బంధు వస్తదంటే దాని కోసమే ఎదురు చూస్తున్న. ఎప్పుడు సెల్లుకు మెసేజీ వస్తదేమోనని చూస్తున్న. డబ్బులు పడగానే ఎరువులు తీసుకొని రావాలి.

# గిరి వికాసం

గిరిజనులను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకురావడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. చెంచులు, ఎస్టీల బీడు భూములను సాగుకు యోగ్యంగా మార్చేందుకు వాటిలో ఉచితంగానే బోర్లు తవ్వించి మోటరుతోపాటు పైపులు, విద్యుత్తు సరఫరాను కల్పించాలనే ఉద్దేశంతో గిరి వికాసం పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఐదు ఎకరాలకుపైగా భూములున్న గిరిజనులను మాత్రమే ఈ పథకానికి అర్హులుగా ఎంపిక చేసింది. అయితే ఈ పథకంలో భాగంగా జిల్లాకు ప్రభుత్వం రూ.2.88 కోట్లు విడుదల చేయగా.. ఇప్పటివరకు రూ.2.51 కోట్లను అధికారులు గిరిజన భూముల అభివృద్ధి కోసం ఖర్చు చేశారు. జిల్లావ్యాప్తంగా 228 బ్లాక్‌లను గుర్తించి 1,474 ఎకరాలను గిరి వికాసం పథకం అమలుకోసం ప్రతిపాదనలు పంపగా.. 180 బ్లాక్‌ల్లోని 1,200 ఎకరాలకు మాత్రమే సర్వే ప్రక్రియ పూర్తైంది. ఇప్పటివరకు 107 బ్లాక్‌ల్లోని 747 ఎకరాలకు సంబంధించి 326 మంది గిరిజన రైతుల భూముల్లో బోర్లు వేయించి.. మోటర్లు బిగించి, విద్యుత్తు సరఫరా కల్పించి అధికారులు సాగుకు యోగ్యంగా మార్చారు. కాగా జిల్లాలో ఎంపిక చేసిన బ్లాక్‌ల్లోని గిరిజనుల భూములను సాగులోకి తెచ్చేందుకు వారు చర్యలను ముమ్మరం చేశారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు 1,20,652 మంది ఉన్నారు. ఈ పథకంలో రూపాయి ఖర్చు లేకుండానే బీడు భూములు సాగులోకి వస్తుండడంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన తెగలకు చెందిన ఎస్టీ, చెంచులను ఆర్థికం గా బలోపేతం చేయడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టారు. ఇప్ప టికే గిరిజనుల సంక్షేమానికి ఎన్నో రకాల ప్రభు త్వ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వారి భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు గత ప్ర భుత్వం గిరిజనుల బీడు భూముల్లో బోర్లు త వ్వించి బోరు మోటరుతోపాటు విద్యుత్తు లైన్ వే సి వాటిని సాగుకు యోగ్యంగా మార్చాలనే ఉద్దే శంతో గిరి వికాసం పథకాన్ని అమల్లోకి తీసుకొ చ్చింది. బోరు తవ్వించడంతోపాటు బోరు మోట రు, పైపులు, విద్యుత్తు లైన్ తదితరాలన్నీ గిరిజన రైతులకు ఉచితంగానే కల్పిస్తున్నారు. అయితే ఐదెకరాలకు పైగా భూములున్న గిరిజనులను మాత్రమే సీఎం గిరి వికాసం పథకానికి అర్హులు గా ఎంపిక చేశారు. ఇప్పటికే జిల్లాలోని ఎంపీడీ వోలు సంబంధిత మండలాల్లో ఐదెకరాలకు పైగా భూమి ఉన్న అర్హులైన గిరిజనులకు సం బంధించి 228 బ్లాక్‌లకు చెందిన 1.474 ఎకరా లను గిరివికాస్ పథకానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికా రులు సర్వే నిర్వహించిన అనంతరం 326 మం ది రైతులను ఎంపిక చేశారు. ఐదెకరాలకుపైగా భూమి ఉన్న అర్హులైన గిరిజనులకు సంబంధించి గిరిజన రైతుల భూముల్లో బోర్లు తవ్వించి మిగ తా వసతులను కల్పిస్తున్నారు. అలాగే జిల్లాలో ఎంపిక చేసిన బ్లాక్‌లోని గిరిజనుల భూములకు నీరందించి సాగులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ముమ్మరం చేశారు.

# తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి.. వెదజల్లే పద్ధతిపైనే రైతుల మక్కువ..



రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించే విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి అన్నదాతలు అతితక్కువ పెట్టుబడులు పెట్టి అధికంగా లాభాలు గడించే విధంగా కృషిచేసింది. అందులో భాగంగానే వరిలో వెదజల్లే పద్ధతిని పలు క్లస్టర్ల పరిధిలో రైతులకు అవగాహన కల్పించింది. వెదజల్లే వరిసాగు విధానం ద్వారా అధిక దిగుబడి వచ్చినందున రైతులు ఎక్కువ శాతం ఈ విధానంపై దృష్టి సారించారు. ప్రస్తుతం అదే విధానంతో ముందుకు సాగుతున్నారు. రైతులంతా ఒకేసారి నారు పోసుకోవడంతో ఒకేసారి నారు ఎదిగి నాటుకు వస్తుంది. ఈ సమయంలో రైతులు, కూలీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అసలే రైతు కూలీల కొరత ఉందంటే.. దీన్ని అదునుగా తీసుకుని వాళ్లు తమ కూలీరేట్లను కూడా ఇష్టానుసారంగా పెంచేస్తున్నారు. దీంతో ఈ సమస్య నుంచి రైతులు బయటపడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. వరిసాగులో నాట్లువేసే పద్ధతికి స్వస్తికి పలుకుతూ వెదజల్లే విధానంపై రైతులు దృష్టి సారించే విధంగా అవగాహన కల్పించారు. ఇప్పటికే మార్కెట్‌లోని రకరకాల నాటువేసే మిషన్లు వచ్చినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో రైతులు వాటివైపు మొగ్గుచూపలేదు. ఈ క్రమంలోనే పురాతన కాలం నాటి వెదజల్లే పద్ధతి అనుకూలంగా ఉండటంతో ప్రస్తుతం రైతులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. గత నాలుగేళ్లుగా రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఈ పద్ధతి వెలుగులోకి వస్తుండటంతో చాలామంది రైతులు ఈ విధానంపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఈ వెదజల్లే పద్ధతిలో సాగువిధానం బాగా పెరిగింది.

### ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ..

సాధారణంగా ఎకరా పొలం నాటు వేయాలంటే కూలీలు రూ.3500 నుంచి రూ.4000వరకు తీసుకుంటారు. వెదజల్లితే ఎకరాకు కేవలం రూ.400 నుంచి రూ.500 ఖర్చు మాత్రమే అవుతుంది. ఇక రైతే స్వయంగా జల్లుకుంటే ఆ ఖర్చు కూడా ఉండదు. దిగుబడులు ఎకరాకు 35 నుంచి 45బస్తాల వరకు వస్తున్నాయి. ముందుగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించి ప్రతి క్లస్టర్‌లో 50 ఎకరాల చొప్పున వెదజల్లే పద్ధతిలో సాగు చేయించారు. పలు క్లస్టర్ల పరిధిలో రైతులతో వెదజల్లే పద్ధతిలో సాగు చేయటంతో రైతులు అధిక దిగుబడి సాధించారు. దీంతో ఇతర రైతులు ఫీల్డ్ విజిట్ చేసి అధికశాతం రైతులు వెదజల్లే విధానంపై చొరవ చూపుతున్నారు.

వెదజల్లే విధానంతో ఎంతో దిగుబడి : శ్రవణ్‌కుమార్, ఏఈవో

వెదజల్లటం ు చాలా తేలికైనా పని. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం అవసరం లేకుండానే వరి విత్తనాలను జల్లుకోవచ్చు. అన్ని విధానాల్లోకెల్లా ఇదే ఉత్తమమైన విధానం. మంచి అనుభవం ఉన్న వ్యక్తితో జల్లిస్తే మడిలో సమానంగా వరి విత్తనాలు పడి ఎక్కువ పిలకలు పెడుతుంది. వెదజల్లిన దగ్గరి నుంచి ఎరువులు, మందులు కావల్సిన మోతాదులో సరైన సమయంలో అందిస్తే ఆశించిన దిగుబడి వస్తుంది.

# అంటుకట్టు సాంకేతికతతో.. కూరగాయల అధిక దిగుబడి

హైదరాబాద్:

అంటుకట్టు సాంకేతికతతో కూరగాయల అధిక దిగుబడి సాధించవచ్చని ఇక్రిశాట్ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. అధిక దిగుబడినిచ్చే వంగడాన్ని సహజమైన వెంటిలేటెడ్ పాలీహౌస్ (ఎన్‌వీపీహెచ్) సాగుతో అంటుకట్టడం వల్ల ఉత్పాదకత పెరుగడంతోపాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చని నిరూపితమైంది. ఫ్రాంటియర్స్ ఇన్ అగ్రోనమీలో ఈ పరిశోధన కథనాన్ని ప్రచురించారు. పాలీహౌస్ వాతావరణ పరిస్థితులలో పెరిగిన అంటుకట్టిన టమోటా మొక్కలపై (సోలనమ్ టోర్వమ్ రూట్‌స్టాక్‌పై సియోన్) దృష్టి సారించారు. బహిరంగ క్షేత్రాల్లో అంటుకట్టని మొక్కలతో వాటిని పోల్చారు. దీంతో ఎన్‌వీపీహెచ్ పద్ధతితో అంటుకట్టిన టమోటాలు 63.8 శాతం ఎక్కువ దిగుబడి వచ్చింది. అలాగే 3 నుంచి 5 వరకు అదనపు పంటలు ఇచ్చింది. కాగా, వంకాయ, మిరపకాయ, దోసకాయ, పుచ్చకాయలు వంటి ఇతర కూరగాయలు, పండ్ల మొక్కలపై కూడా ఈ సాంకేతికతో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాలతో కలిసి రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

అధిక దిగుబడులతో రైతుల జీవితాలు మారడంతోపాటు పోషకాహారం, జీవనోపాధి, ఆహార స్థిరత్వాన్ని మెరుగుపరుస్తుందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. కూరగాయల అంటుకట్టు పద్ధతి చిన్న రైతులకు గేమ్ ఛేంజర్ అని ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (రీసెర్చ్, ఇన్నోవేషన్) డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్ తెలిపారు. ఈ విధానం ద్వారా దిగుబడితోపాటు లాభాలను పెంచడమే కాకుండా, వ్యవస్థ స్థితిస్థాపకతకు ఉపయోగపడుతుందని తమ పరిశోధనలో తేలిందని చెప్పారు. వాతావరణ వైవిధ్యాన్ని ఎదుర్కొంటున్న ప్రాంతాలలోనూ కూరగాయల పెంపకంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి అంటుకట్టు పద్ధతి ఎలా సహాయపడుతుందో తమ అధ్యయనం స్పష్టం చేసిందని ఇక్రిశాట్ రెసిలెంట్ ఫార్మ్ అండ్ ఫుడ్ సిస్టమ్స్, తాత్కాలిక డైరెక్టర్ డాక్టర్ రమేష్ సింగ్ తెలిపారు. ప్రారంభంలో టమోటాలపై దృష్టి సారించినప్పటికీ, అభివృద్ధి చేసిన అంటుకట్టు పద్ధతిని వంకాయ, మిరప, దోసకాయ, పొట్లకాయ, పుచ్చకాయలతో సహా విస్తృత శ్రేణి కూరగాయల పంటలకు అన్వయించవచ్చని ఈ వినూత్న పరిశోధనకు కారణమైన ఇక్రిశాట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రోహన్ ఖోపడే వివరించారు. మరోవైపు విభిన్న వ్యవసాయ వ్యవస్థలలో ఉత్పాదకతను పెంచే సామర్థ్యాన్ని ఈ సాంకేతికత అన్వయిస్తుందని ఇక్రిశాట్ వ్యవసాయ రంగంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గజనన్ సావర్గాంకర్ తెలిపారు. ప్రభుత్వ సహకారంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ రైతులకు గణనీయమైన ప్రయోజనాలు అందించిందని, కూరగాయల ఉత్పాదకత 30 శాతం నుంచి 150 శాతం వరకు పెరిగిందని వివరించారు.




అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# కరూర్ లాంటి ఘటనలు ఆపలేమా ?

దేశంలో రాజకీయ పార్టీల కార్యకలాపాలు నానాటికీ శృతి మించుతున్నాయి. ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా పోయింది. ప్రజలను ఏమార్చడం, సెంటిమెంట్లను రెచ్చగొట్టడం, అధికారం సంపాదించడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల విన్యాసాలు ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టు సిట్‌ను వేసింది. దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికి తీసినా అందుకు కారకులైన ఆ పార్టీ వారిమీద ఎలాంటి చర్యలు ఉంటాయన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఇలాంటి ఘటనలు చూశాం. ఎపిలో చంద్రబాబు హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా పదుల సంఖ్యలో చనిపోయారు. జగన్ మొన్నటికి మొన్నర్యాలీలో ఒకరిద్దరు చనిపోయారు. రాజకీయ నేతల హత్యలుగా వీటిని పరిగణించి చర్యలు తీసుకుని ఉంటే కరూర్ ఘటన జరిగివుండేది కాదు. భారీగా బహిరంగ సభలు నిర్వహించడం, ర్యాలీలు చేపట్టడం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అయినా ఆయా పార్ఈల నేతల్ల్లో కించిత్తు కూడా పశ్చాత్తాపం లేదు. తమిళనాడు కరూర్‌లో టివికె నాయకుడు, సినీ నటుడు విజయ్ సభలో చోటుచేసుకున్న మహా విషాదం మాటలకందనిది. నిర్వాహకుల భద్రతా లోపాలే తొక్కిసలాటగా మారి 41 మంది ప్రాణాలను బలిగొనడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. ఇలాంటి ర్యాలీలు చేపట్టి ఏం ఉద్ధరిస్తారన్నది ప్రజలు కూడా ఆలోచించాలి. వీరంతా మన ఓట్లను కొల్లగొట్టే యంత్రాలని గుర్తించాలి. మనదగ్గర ఓటు ఆయుధం ఉందని గుర్తించి మసలుకోవాలి. నటుడు విజయ్‌ను చూడడానికి వచ్చిన 41మంది చనిపోతే ఆ కుటుంబాలు ఏం కావాలి. తీవ్రంగా గాయపడిన 80 మందిలో ఐదుగురి పరిస్థితి నేటికీ విషమంగానే ఉంది. ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారంతా అణగారిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారే. వారిని ఆదుకునేందుకు ఎలాంటి ప్రణాళిక ఉందో చెప్పడం లేదు. వారి కుటుంబాలకు భరోసా ఎవరు ఇస్తారో చెప్పడం లేదు. పోలీసులు ఇలాంటి ర్యాలీలకు అనుమతి ఇచ్చేముందు ఎందుకు ఆలోచించరన్నది కూడా ముఖ్యమే. హీరో విజయ్ వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీకెండ్ రోడ్ షోలు ప్రారంభించారు. విజయ్ ను చూసేందుకు అత్యధిక సంఖ్యలో సభలకు తరలివస్తున్నారు. వారికి తగిన భద్రత కల్పించడం, వారు ఇళ్లకు క్షేమంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయడం నిర్వాహకుల బాధ్యత. అలాంటి బాధ్యతలను గాలికి వదిలేయడంతో తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తమ పార్టీపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారంటూ టివికె పార్టీ చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందుకంటే ఇలాంటి ర్యాలీలు నిర్వహించి ఏం చేస్తారన్నది చెప్పాలి. తగిన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, ఆస్తుల విధ్వంసం చేస్తున్న వారిపై నిర్వాహకులకు నియంత్రణ ఉండటం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో నాలుగు రోజుల క్రితమే వాదనలు వినిపించాయి. ఆస్తినష్టం జరగకుండా ముందస్తుగా సభల నిర్వాహకుల నుంచి డిపాజిట్లు వసూలు చేయాలంటూ హైకోర్టు ఆదేశించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో మార్గదర్శకాలపై నివేదిక సమర్పించాలంటూ ధర్మాసనం ఆదేశించినా, సరైన జాగ్రత్తలు తీసుకోలేదనడానికి కరూర్ ఉదంతమే సాక్ష్యం.



కరూరులో అభిమానులు రాత్రి 7.30 గంటలకు విజయ్ వచ్చేవరకూ ఎండలో, కనీసం తాగునీళ్లిచ్చే దిక్కులేక, ఆహారం లేక అలమటించాల్సి వచ్చింది. 10 వేల మంది సభకు వస్తారని నిర్వాహకులు అనుమతి తీసుకుని, 30 వేల మందికిపైనే మూడు జిల్లాల నుంచి సమీకరించారు. విజయ్ ను దగ్గర నుంచి చూడాలంటూ కొందరు అభిమానులు చెట్టు ఎక్కగా, ఆ చెట్టు కొమ్మ విరిగిపడటమే తొక్కిసలాటకు కారణమని చెబుతున్నారు. నీరసంగా ఉన్న అభిమానుల కోసం విజరు తన కాన్వాయ్ నుంచి నీళ్ల సీసాలు విసరడం, కొందరు అత్యుత్సాహంతో కాన్వాయ్ వద్దకు తోసుకెళ్లడమూ గందరగోళానికి కారణమైందంటున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు చేరుకోవడం, నిర్వాహకులు, స్థానిక అధికారుల మధ్య గందరగోళం, నిర్వహణాలోపమే ఘటనకు ప్రధాన కారణం. వెనువెంటనే సంఘటనా స్థలానికి సిఎం వచ్చి, పరామర్శించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం, మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అందించడం, నష్టపరిహారం ప్రకటించడం ఉపశమనం కలిగించేవే! రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. పరిహారం ప్రకటించిన విజయ్ బాధిత కుటుంబాలను పరామర్శించ కుండా వెనుదిరగడమూ చర్చనీయాంశమైంది. దీనిని మద్రాస్ హైకోర్టు కూడా తప్పు పట్టింది. ఇక వారే సిబిఐ విచారణ కోరడం మరీ దారుణం. ఆయన కానీ, వారి పార్టీ నాయకులు గానీ క్షతగాత్రులకు వైద్యమందించిన ఆసుపత్రులకైనా వెళ్లకపోవడం శోచనీయం. రాజకీయ సభలైనా, మతపరమైనవైనా, ఏ కార్యక్రమమైనా? అక్కడికి వచ్చే ప్రజల ప్రాణాలను కాపాడి, క్షేమంగా ఇళ్లకు చేర్చాల్సిన బాధ్యత నిర్వాహకులదే. ఇరుకుగా ఉండే ప్రదేశాలను జనాకర్షణ కలిగిన నేతల భారీ సభల కోసం, రోడ్‌షోల కోసం వినియోగించకుండా, విశాల ప్రదేశాల్లోనే సభలు నిర్వహించేలా చూడటం అవసరం. పదుల సంఖ్యలో అమాయక ప్రజల మరణానికి కారణమైన ఇటువంటి తొక్కిసలాట ఘటనల సందర్భంగా జరిగిన నిర్వహణ వైఫల్యాలు, పాలనా యంత్రాంగం లోపాలు వంటివి సమీక్షించి, తగు చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. మద్రాస్ హైకోర్టు సూచనల మేరకు ఇలాంటి ర్యాలీలపై నిషేధం విధించాలి. అప్పుడే కొంతవరకైనా మేలు కలుగుతుంది. జనాలు కూడా వేలం వెర్రిలాగా ర్యాలీలకు, సభలకు వెళ్లకుండా ఉండడం కూడా మంచిది.

## యాదాద్రిలో భక్తుల కిటకిట

### నిండిపోయినక్యూలైన్లు

**యాదాద్రి,**

యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తుల రాక పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామి వారి సర్వదర్శనానికి రెండు గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి ఒక గంట సమయం పట్టింది. ఆదివారంతో దసరా సెలవులు ముగియనుండడంతో.. యాదాద్రి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అందులోనూ శనివారం కావడంతో.. భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. అధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల రద్దీ ఆదివారం మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

## గురుకుల విద్యార్థులకు పచ్చకామెర్లు

**పార్వతీపురం,**

పచ్చకామెర్లు, విష జ్వరాలతో పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థినులు హడలిపోతున్నారు. కురుపాం బాలికల గురుకుల పాఠశాలలో 60 మంది పచ్చకామెర్లతో బాధపడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందారని, మరో 19 మందిని మెరుగైన వైద్య పరీక్షల కోసం కేజీహెచ్‌కు తరలించామని సూపరింటెండెంట్ వాణి తెలిపారు. దసరా సెలవులకు బాలికలు ఇళ్లకు వెళ్లారని, అక్కడి నుంచి వచ్చాక వారి ఆరోగ్య పరిస్థితి క్షీణించిందన్నారు. కురుపాం గురుకుల పాఠశాలలో 38 మందికి పచ్చకామెర్లు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. వైద్య బృందం కురుపాం గ్రామంలో నీటి నమూనాలను సేకరించిందని, పీడియాట్రిక్ వైద్యులు బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

## భారీగా నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు

### దాడులుచేసి తయారీ కేంద్రం గుర్తింపు

### రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం

### నిర్వాహకులపై కేసులు నమోదు

**మదనపల్లి,**

అన్నమయ్య జిల్లా ములకల చెరువులో నకిలీ మద్యం తయారు చేస్తున్న ముఠాను పోలీసులు గుర్తించారు. భారీ ఎత్తున మద్యం తయారు చేస్తున్న యూనిట్‌ను పట్టుకున్నారు. నకిలీ మద్యంతో రెడీగా ఉన్న వాహనాన్ని సీజ్ చేశారు. సీసాల మీద ఉన్న లేబుళ్లను స్కాన్ చేయడంతో.. అక్రమ మద్యం తయారీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి దాడులు నిర్వహించారు. ఈ క్రమంలోనే దాడులు నిర్వహించి.. రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు కలిసి ములకలచెరువు కనుగొండ ఆర్చి ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు సహా.. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దతిప్ప సముద్రం మండలంలో ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నకిలీ మద్యం తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. 15 వేల నకిలీ మద్యం సీసాలు, 1,050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1,500 లీటర్ల ÷–లబెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, మూతలు, స్టిక్కర్లు, తయారీ పరికరాలు, ఇతర సామగ్రితోపాటు సరఫరాకు వినియోగిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనందన్, ఒడిశా బ్రహ్మపుర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజును అదుపులోకి తీసుకున్నారు. నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు, రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. జనార్దన్‌రావు, రాజు, ములకల చెరువులోని రాక్ స్టార్ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## అభిమాని పెళ్లికి హాజరైన లోకేశ్

**అమరావతి,**

తన పెళ్లికి రావాలని ఓ అభిమాని పంపిన ఆహ్వానాన్ని మన్నించిన మంత్రి లోకేశ్ అకస్మాత్తుగా వారి ఇంట ప్రత్యక్షమయ్యారు. దీంతో ఆ అభిమాని నోట మాట రాలేదు. 2023 ఆగస్టు 20న నారా లోకేశ్ విజయవాడలో నిర్వహించిన యువగళం పాదయాత్రకు విశేష స్పందన లభించింది. విజయవాడ మొగల్రాజపురానికి చెందిన భవానీ(భవ్య) యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ్ అభిమానిగా మారింది. తన పెళ్లికి విచ్చేసి ఆశీర్వదించాలంటూ ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వాన పత్రిక పంపించారు. అకస్మాత్తుగా అభిమాన నేత తమ ఇంటికి రావడంతో భవ్యతో పాటు ఆమె తల్లిదండ్రులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

## పాక్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తే గట్టి సమాధానం

### ప్రపంచపటంలో పేరు లేకుండా చేస్తాం

### ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక

**న్యూఢిల్లీ,**

:ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం పాకిస్థాన్ కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం నాడు దిమ్మతిరిగే వార్నింగ్ ఇచ్చారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని స్పానర్స్ చేసే చర్యలను పాక్ మానుకోకుంటే ఆ దేశం ప్రపంచ పటం నుంచి కనుమరుగవుతుందని హెచ్చరించారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్లో చూపించిన సంయమనాన్ని ప్రతిసారీ చూపించలేవని అన్నారు. ఈసారి నిర్ణయాత్మక, అత్యంత శక్తివంతమైన సమాధానం ఇస్తుందని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ 1.0లో చూపిన సంయమనాన్ని ఈసారి చూపించం. ప్రపంచ పటంలో ఉండాలనుకుంటోందో, లేదో తేల్చుకునేలా ఈసారి పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఉంటుంది. ప్రపంచ పటంలో పాక్ ఉండదలిస్తే మాత్రం ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేయడం ఆపితీరాలి' అని జనరల్ ద్వివేది అన్నారు. బికనీర్ మిలట్రీ స్టేషన్‌తో సహా పలు ఫార్వార్డ్ ఏరియాల్లో శుక్రవారం నాడు ఉపేంద్ర ద్వివేది పర్యటించారు. బలగాల సన్నద్ధతను అంచనా వేసేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. మిలట్రీ సీనియర్ అధికారులు, వెటరన్స్, సివిల్ డిగ్నటరీలతో ఆయన సమావేశం అయ్యారు. ఆధునికీకరణ, యుద్ధ సన్నాహకాలు, అడ్వాన్సింగ్ టెక్నలాజికల్ సామర్థ్యాలు, ఆపరేషనల్ ఎక్సలెన్స్‌కు ఆర్మీ కృతనిశ్చయంతో ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ఆర్టీసికి దసరా బొనాంజా

**హైదరాబాద్,**

బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా టీజీఎస్ఆర్టీసీకి రూ.110 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ సారి 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని తొలుత నిర్ణయించినప్పటికీ.. ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేశారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 6300 ప్రత్యేక బస్సులు నడపగా.. రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే.. ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని, కొందరు ప్రైవేటు వాహనాలనూ ఆశ్రయించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈనెల 5, 6వ తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సంస్థ నిర్ణయించింది.

## నగరంలో మరోమారు వర్షం

### వచ్చేనాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్,**

హైదరాబాద్‌లో పలుప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి కొమోరిన్ ప్రాంతం వరకు తమిళనాడు అంతరభాగంగా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని తెలిపింది. తమిళనాడు తీరం వెంబడి నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని చెప్పింది. ఈ క్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది. ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, ములుగు, భప్తప్రాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. బుధశారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## చెల్లని బిసి జివోతో కాంగ్రెస్ ఎన్నికల ప్రకటన

### ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు

### మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపణ

**జనగామ,**

చట్టపరంగా చెల్లని జీఓ తెచ్చి స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని హరిపిరాల, వెలికట్టే గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశాలకు ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేసి, ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి నిజంగా ధైర్యం ఉంటే ఎన్నికల పక్రియను వేగవంతం చేయాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి తన శిష్యుడేనని, కానీ బ్రోకర్ రాజకీయాలు ఆడుతున్నట్లు దుయ్యబట్టారు. మూడుసార్లు గెలవకపోయినా బ్రోకర్ పనులు చేస్తూ ముఖ్యమంత్రి అయ్యాడన్నారు.రెండు సంవత్సరాల క్రితం జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను తరచూ వాయిదా వేస్తూ గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. హైకోర్టు గడువు ఒత్తిడిలోనే ప్రభుత్వం బీసీలపై మొసలి కన్నీరు కారుస్తూ రాజ్యాంగబద్ధం కానీ జీఓను తెచ్చిందన్నారు. బీసీ సంఘాలు, రాజ్యాంగ నిపుణులు కూడా ఈ జీఓ చెల్లదని చెబుతున్నా, ప్రభుత్వం నోరు మెదపకపోవడం వెనుక దాగివున్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రకటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తప్పా మరే ఒక్క మంత్రి, ఎమ్మెల్యే ఎన్నికలపై మాట్లాడక పోవడం కాంగ్రెస్ లోపాలను బయట పెడుతోందన్నారు. ఎన్ని సర్వేలు చేయించినా తీవ్ర ప్రజా వ్యతిరేకత కాంగ్రెస్‌పై ఉందని తెలుసుకున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు మోసపూరిత పద్ధతులు అవలంబిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 22 నెలల్లో ప్రజలకు ఎంత బాకీ పడిందో స్పష్టంగా చూపించేందుకు బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన 'కాంగ్రెస్ బాకీ కార్డులను' ఇంటింటికి పంపిణీ చేయాలని పార్టీ శ్రేణులను సూచించారు. ప్రజల అవగాహన పెరిగింది, పాలకుర్తి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలో పలవురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు.తాజాగా పాలకుర్తి కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తార హస్తం పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం ఆమె గులాబీ కండువా కప్పుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో తార బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆమెకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓయూ నేత పృథ్వీ రెడ్డి కూడా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామం నుండి 120 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఝాన్సీ రెడ్డి తీరు వల్లే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశామని నేతలు పేర్కొన్నారు.

## అసోం గాయకుడు జుబిన్ మృతి

### విషం ఇచ్చి చంపారన్న ఆరోపణలు

### ఆ కోణంలో పోలీసుల దర్యాప్తు

**గౌహతి,**

అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తూ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతోన్న వేళ ఈ కేసు కీలక మలుపు తిరిగింది. జుబీన్‌కు మిషమిచ్చి ఉంటారని ఆయన బ్యాండ్‌మేట్ శేఖర్ జ్యోతి గోస్వామి సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడి మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ ఈ కుట్రకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. జుబీన్ మృతిపై అస్సాం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పలువురు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. జుబీన్ బ్యాండ్‌మేట్ గోస్వామి కూడా విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగానే సంచలన ఆరోపణలు చేశారు. సింగపూర్‌లో జుబీన్‌తో కలిసి ఆయన మేనేజర్ సిద్దార్థ్ శర్మ ఒకే హోటల్‌లో ఉన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## పీసీబీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయండి

### మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది డిమాండ్

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ బాధ్యతల నుంచి మోహ్‌సీన్ నఖ్వీ తప్పుకోవాలని ఆ జట్టు మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు వైఫల్యం నేపథ్యంలో అఫ్రిది ఈ ప్రతిపాదన చేశాడు. పాకిస్థాన్ మంత్రిగా.. పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ న్యాయం చేయలేకపోతున్నాడని అభిప్రాయపడ్డాడు. పాకిస్థాన్ క్రికెట్‌పై ప్రత్యేక శ్రద్ద చూపే ఛైర్మన్ కావాలని అఫ్రిది నొక్కి చెప్పాడు.ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు భారత్ చేతిలో ఘోర పరాజయాలను ఎదుర్కొంది. భారత్‌తో ఆడిన మూడు మ్యాచ్‌లకు మూడింటిని పాకిస్థాన్ ఓడిపోయింది. ఫైనల్లో పోటీ ఇచ్చినా తొలి రెండు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా కూడా నఖ్వీ వ్యవహరిస్తున్నాడు. కీలక పదవుల్లో ఉన్న నఖ్వీ పూర్తిగా సలహాదారుపై ఆధారపడుతున్నాడని అఫ్రిది ఆరోపించాడు.పీసీబీ ఛైర్మన్, పాకిస్థాన్ మంత్రి అయిన మోహ్‌సిన్ నఖ్వీ సాబ్‌కు నా అభ్యర్థన, సలహా ఏంటంటే.. పీసీబీ ఛైర్మన్ బాధ్యతల నుంచి వీలైనంత త్వరగా తప్పుకోవాలి. పీసీబీ అనేది పాకిస్థాన్ మంత్రిత్వ శాఖ కంటే పూర్తిగా భిన్నమైనది. కాబట్టి పీసీబీకి ఆయన దూరంగా ఉండాలి. పాకిస్థాన్ క్రికెట్‌కు ప్రత్యేక శ్రద్ధ, సమయం కేటాయించే వ్యక్తి అవసరం. నఖ్వీ పూర్తిగా సలహాదారులపైనే ఆధారపడుతున్నారు. ఈ సలహాదారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారు. క్రికెట్ గురించి తెలియదని ఆయనే స్వయంగా చెప్పారు. కాబట్టి ఆట గురించి తెలిసిన వ్యక్తులను పీసీబీ ఛైర్మన్‌గా, సలహాదారులుగా నియమించాలి.'అని అఫ్రిది విజ్ఞప్తి చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీ సందర్భంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు భారత ఆటగాళ్లు నిరాకరించారు. అయితే ఈ ఘటనపై పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ అనవసర వివాదాన్ని సృష్టించాడు. మ్యాచ్ రిఫరీని తొలగించాలంటూ ఐసీసీకి ఫిర్యాదు చేశాడు. ఐసీసీ పట్టించుకోకపోవడంతో టోర్నీ నుంచి తప్పుకుంటామని బెదిరింపులకు దిగాడు. ఇక ఆసియా కప్ ఫైనల్ అనంతరం నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకునేందుకు భారత్ నిరాకరించడంతో.. ఆ టైటిల్‌ను ఆటగాళ్లకు ఇవ్వకుండా తన వెంట తీసుకెళ్లిపోయాడు. ఈ వ్యవహారంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. క్షమాపణలు చెప్పిన నఖ్వీ.. టైటిల్ కావాలంటే ఏసీసీ ఆఫీస్‌కు వచ్చి తీసుకెళ్లాలని కండిషన్ పెట్టాడు. దాంతో మరింత ఆగ్రహానికి గురైన బీసీసీఐ.. ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్దమైంది.

## ప్రాక్టీస్ సెషన్‌కు పలువురు ఆటగాళ్లు దూరం

ఆసియా కప్ 2025 టోర్నీలో విజేతగా నిలిచిన టీమిండియా నాలుగు రోజుల వ్యవధిలోనే వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సిద్ధమైంది. గురువారం(అక్టోబర్ 2) నుంచి అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌లో బరిలోకి దిగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం అహ్మదాబాద్ చేరిన భారత జట్టు ప్రాక్టీస్ కూడా ప్రారంభించింది. ఈ ఇంటెన్స్ ప్రాక్టీస్ సెషన్‌కు టీమిండియా స్టార్ ఆటగాళ్లు అయిన జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ దూరంగా ఉన్నారు.ఆసియా కప్ 2025 ఫైనల్ ఆడిన ఈ ముగ్గురు ఆటగాళ్లు.. అలసటను తొలగించుకునేందుకు ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదని తెలుస్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు ఇతర ఆటగాళ్లంతా ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఈ ప్రాక్టీస్ సెషన్‌ను పర్యవేక్షించాడు. మూడు గంటల పాటు సాగిన ఈ ప్రాక్టీస్ సెషన్ లైట్ వార్మప్‌తో మొదలైంది.ఆ తర్వాత ఫీల్డింగ్ ప్రాక్టీస్‌తో పాటు నెట్స్‌లో ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ నెట్స్‌లో స్పిన్నర్లతో పాటు ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కొన్నారు. మిడిలార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్ భారీ షాట్లు సాధన చేశారు. గిల్.. పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సుదీర్ఘ స్పెల్స్ బౌలింగ్ చేశారు. ఈ ఇద్దరూ ఆటగాళ్లు భారత్–ఏ తరఫున.. ఆస్ట్రేలియా–ఏతో టెస్ట్ సిరీస్ ఆడారు. బౌలింగ్ రిథమ్‌ను అందుకునేందుకు శ్రమించారు. గంభీర్.. ఈ మ్యాచ్‌కు సంబంధించిన పిచ్‌ను పలుమార్లు పరిశీలించాడు. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు టీమ్ కాంబినేషన్‌ను ఎంపిక చేయడంపై గంభీర్ ఫోకస్ పెట్టాడు. ఆస్ట్రేలియా–ఏతో శతకం సాధించిన దేవదత్ పడిక్కల్‌ను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. నితీష్ కుమార్ రెడ్డితో జట్టుకు బ్యాటింగ్‌తో పాటు అదనపు పేస్ ఆప్షన్ లభించనుంది. మరోవైపు వెస్టిండీస్ జట్టు వర్షం కారణంగా ఇండోర్ నెట్స్‌కే పరిమితమైంది. అరగంట మాత్రమే సాధన చేసింది. ఈ మ్యాచ్ పిచ్ కండిషన్స్ స్పిన్‌కు అనుకూలంగా ఉండనున్నాయి. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌తో పాటు జడేజా కీలకం కానున్నాడు.

## వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల హవా

వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు దుమ్మురేపారు. ఒకే రోజు రెండు స్వర్ణాలతో పాటు నాలుగు మెడల్స్‌ను గెలుచుకున్నారు. మంగళవారం జావెలిన్ త్రోలో రెండు బంగారు పతకాలు, ఒక రజతం రాగా.. డిస్కస్ త్రోలో యోగేశ్ కతూనియా రజతం సాధించాడు. పురుషుల ఎఫ్ 64 కేటగిరిలో సుమిత్ అంటిల్ జావెలిన్‌ను 71.37 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో తానే సృష్టించిన ఛాంపియన్‌షిప్ రికార్డ్(2023లో 70.83 మీటర్లు)ను తుడిచిపెట్టాడు. ఈ టోర్నీలో పసిడి హ్యాట్రిక్ కూడా కొట్టాడు. 2023, 24 పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లోనూ అతను స్వర్ణం సాధించాడు.సుమిత్ అంటిల్ ముందుగా రెజ్లర్ కావాలనుకున్నాడు. కానీ 17 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతను నడుపుతున్న బైక్.. ట్రక్‌ను ఢీకొనడంతో ఎడమ కాలిని తీసేయాల్సి వచ్చింది. దాంతో రెజ్లర్ కావాలనే కల చెదిరింది. కానీ క్రీడలపై ఉన్న మక్కువ పోలేదు. 2017లో పారా అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించాడు. జావెలిన్ త్రోలో పట్టు సాధించి ఈ క్రీడల్లో దూసుకెళ్తున్నాడు.పురుషుల ఎఫ్ 44 జావెలిన్ త్రోలో సందీప్ సంజయ్ సర్గార్ స్వర్ణం.. సందీప్ సిల్వర్ మెడల్‌తో మెరిసారు. సంజయ్ 62.82 మీటర్ల త్రో వేయగా.. సందీప్ 62.67 మీటర్లు జావెలిన్ విసిరాడు. ఎడినిల్‌సన్(బ్రెజిల్) బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన సందీప్ సంజయ్ నేపథ్యం భిన్నమైనది. నాలుగేళ్ల వయసులోనే ఒక ప్రమాదంలో అతడి కాలికి తీవ్ర గాయమైంది. ఆటపై ఆసక్తితో అతను పారా జావెలిన్‌వైపు అడుగేసాడు. ఆర్థికంగా అవరోధాలు ఎదురైనా.. సాధన మానలేదు. ఒకవైపు పుణెలో డెలివరీ బాయ్‌గా పని చేస్తూనే శిక్షణ సాగించిన అతడు.. తొందరగానే ఆటపై పట్టు సంపాదించాడు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. 2022లో ప్రపంచ పారా గ్రాండ్‌ప్రిలో పసిడి నెగ్గాడు. 2024 షార్జాలో జరిగిన ప్రపంచ పారా గ్రాండ్ ప్రిలోనూ స్వర్ణంతో మెరిశాడు. ఇప్పుడు ప్రపంచ అథ్లెటిక్స్‌లో తొలిసారి బరిలో దిగి పసిడితో సత్తా చాటాడు.

## బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారిన తిలక్ వర్మ

భారత్ తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ మీద ఫైనల్లో విజయంతో ఆసియా కప్ 2025 ట్రోఫీని సాధించింది. అయితే పహల్గాం ఉగ్రదాడి, పాక్ బోర్డు చర్యల ఫలితంగా పాకిస్తాన్ మంత్రి, ఏసీసీ అధ్యక్షుడు మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా తీసుకోవాల్సి రావడంతో ఆసియా కప్ ట్రోఫీని భారత ఆటగాళ్లు నిరాకరించడం తెలిసిందే. అయితే ఫైనల్లో ఛేజింగ్ లో భారత్ తడబాటుకు లోను కాగా, కీలక సమయంలో బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారిన ప్లేయర్ తెలుగు తేజం తిలక్ వర్మ. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 147 పరుగులకు పరిమితం కాగా, ఛేజింగ్‌లో ఈసారి అభిషేక్ శర్మ త్వరగా ఔటయ్యాడు. ఆ వెంటనే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వికెట్ చేజార్చుకోవడం, మరో కీలక ఆటగాడు శుభ్‌మన్ గిల్ సైతం ఔటయ్యాడు. దాంతో కేవలం 20 పరుగులకే భారత్ టపార్డర్ 3 కీలక వికెట్లు కోల్పోయింది. మరోవైపు గాయంతో కీలక ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా సైతం జట్టులో లేడు. మ్యాచ్ ఏమవుతుందా అని భారత అభిమానుల్లో, జట్టులోనూ కంగారు మొదలైంది. కానీ తీవ్రమైన ఒత్తిడిలో నిలబడి ఛేజింగ్‌ను పూర్తి చేశాడు తిలక్ శర్మ. 22 ఏళ్ల యువకుడు ఆసియా కప్ లాంటి ఫైనల్ మ్యాచులో ఒత్తిడిని జయించి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. అసలే ప్రత్యర్థి పాకిస్తాన్ కావడంతో జాగ్రత్తగా ఆడిన తిలక్ చివర్లో వేగం పెంచి షాట్స్ ఆడాడు. శివం దుబేతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పడంతో రికార్డు స్థాయిలో 9వ సారి ఆసియా కప్ విజేతగా భారత్ నిలిచింది. ఫైనల్ మ్యాచ్ సూపర్ స్టార్ తిలక్ వర్మ గురించి ఆసక్తికర విషయాలు ఇక్కడ అందిస్తున్నాం. తిలక్ వర్మ పూర్తి పేరు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ. తిలక్ 2002 నవంబర్ 8న హైదరాబాద్‌లో జన్మించాడు. నాన్నది మేడ్చల్, కాగా అమ్మది భీమవరం అని ఓసారి తెలిపాడు. పేరుతో ఠాకూర్ అని చూసి వేరే రాష్ట్రం నుంచి వలస వచ్చామని కొందరు అనుకోవచ్చు. కానీ తాత ముత్తాతల నుంచి కూడా తరతరలా నుంచి ఇక్కడే ఉంటున్నాం. తాను కూకట్‌పల్లిలో జన్మించగా.. తన తల్లిదండ్రులు సైతం నగరంలోనే పుట్టారని తెలిపాడు. తిలక్ వర్మకు అన్న ఉన్నాడు. తను బీటెక్ చేశాడు. అతడు బ్యాడ్మింటన్‌లో నేషనల్ లెవల్‌కు వెళ్లాడు. తండ్రి ఎలక్ట్రికల్ వర్క్ చేసేవారని తెలిపాడు. తెలంగాణ బిడ్డ ఇక్కడ అని కేటీఆర్ చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఏపీకి చెందిన వ్యక్తి విజయాలు సాధిస్తే తెలంగాణ వాడు అయ్యాడా అని ట్రోల్ చేశారు. అయితే తాను తెలంగాణకు చెందిన వాడినని తిలక్ ఓ వీడియోలో స్పష్టం చేశాడు.తిలక్ వర్మ చిన్నతనంలో అతడికి తండ్రి క్రికెట్ కోచింగ్ ఇప్పించడంలో ఇబ్బంది పడ్డారు. కోచింగ్ ఖర్చులు భరించలేకపోయేవారు. టెన్నిస్ బంతితో ఆడుతున్న సమయంలో మొదటి కోచ్ సలాం బయాష్ తిలక్ ను గుర్తించాడు. తన వంతుగా ఆయన శిక్షణ ఖర్చులను భరించి, తిలక్ వర్మకు అవసరమైన కిట్ అందించారు. ఇంటి నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగంపల్లి అకాడమీకి కోచ్ తన స్కూటర్ మీద తీసుకెళ్లేవారు. మొదట్లో ఫాస్ట్ బౌలింగ్ వేసిన తిలక్‌ను కోచ్ స్పిన్ మీద ఫోకస్ చేయాలని సూచించారు. 2018%–%19 సీజన్‌లో తిలక్ వర్మ హైదరాబాద్ తరపున ఫస్ట్–క్లాస్ అరంగేట్రం చేశాడు. తరువాత ఏడాది, అతను దక్షిణాఫ్రికాలో జరిగిన 2020 అండర్–19 ప్రపంచ కప్ కోసం భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆరు మ్యాచ్‌లు ఆడాడు, మూడు ఇన్నింగ్స్‌లలో 86 పరుగులు చేయగా.. భారత్ ఫైనల్‌కు చేరుకుంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (2021–22)లో హైదరాబాద్ తరపున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు, ఆ తర్వాత ముంబై ఇండియన్స్ 2022 %ఖూా% వేలంలో తిలక్ వర్మను తీసుకుంది. సెప్టెంబర్ 15, 2023న వన్డేల్లో టీమిండియాకు అరంగేట్రం చేశాడు. అంతకు కొన్ని రోజులముందు టీ20ల్లో భారత్‌కు తొలిసారిగా ప్రాతినిధ్యం వహించాడు తిలక్. ఈ క్రమంలో టీ20ల్లో బెస్ట్ బ్యాటర్లలో ఒకడిగా నిలిచాడు. ఆసియా కప్ 2025 ఫైనల్లో అద్భుత బ్యాటింగ్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. తిలక్ వర్మ 53 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి భారత జట్టును ఆసియా కప్ విజేతగా నిలిపాడు. ప్రధానంగా బ్యాటర్ అయినా, కుడిచేతి వాటం ఆఫ్–బ్రేక్ బౌలర్‌గానూ సేవలు అందిస్తున్నాడు.

## వైభవ్ సూర్యవంశీ బీభత్సమైన ప్రదర్శన

వైభవ్ సూర్యవంశీ స్ట్రాంగ్ ఎటాక్ తర్వాత ఆస్ట్రేలియా మళ్ళీ కన్నీళ్లు పెట్టుకుంటుంది. సరిగ్గా ఒక సంవత్సరం తర్వాత, ఒక భారీ అవకాశం వచ్చింది. అదే జట్టు, అదే ఫార్మాట్, అదే తేదీ. కాబట్టి, అక్టోబర్ 1, 2024న చేసినట్లుగానే వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన సెంచరీ సాధిస్తాడా? అతను మరోసారి కొత్త ప్రపంచ రికార్డును సృష్టిస్తాడా? ఏడాది క్రితం చెన్నైలో ఆస్ట్రేలియాతో జరిగిన మల్టీ–డే మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ బ్రిస్బేన్‌లో కూడా మెరుస్తాడా? లేదా అనేది చూడాలి. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి, ముందుగా, వైభవ్ సూర్యవంశీ ఒక సంవత్సరం క్రితం అక్టోబర్ 1, 2024న ఆస్ట్రేలియన్ అండర్–19 జట్టుపై ఏమి చేశాడో తెలుసుకుందాం. ఆ మ్యాచ్ వైభవ్ సూర్యవంశీకి చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే, ఇది అండర్–19 మల్టీ–డే ఫార్మాట్‌లో అతని అరంగేట్రం. కానీ, వైభవ్ తన అరంగేట్రంలో భారీ ప్రభావాన్ని చూపించి ఆశ్చర్యపరిచాడు. చెన్నై మైదానంలో ఆస్ట్రేలియన్ బౌలర్లను ఓడించి, అతను కేవలం 58 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 18 సిక్సర్లు, ఫోర్లతో అద్భుతమైన సెంచరీని సాధించాడు. అక్టోబర్ 1, 2024న ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 62 బంతుల్లో 104 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌తో అతను ప్రపంచ రికార్డును కూడా సృష్టించాడు. అంతర్జాతీయ యూత్ టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, వైభవ్ సూర్యవంశీ ఒక సంవత్సరం తర్వాత, అక్టోబర్ 1, 2025న ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో జరిగే యూత్ టెస్ట్ మ్యాచ్‌లో ఏమి చేస్తాడు? అతను ఏ రికార్డును సృష్టిస్తాడు? ఒకే తేడా ఏమిటంటే, ఈసారి ఆస్ట్రేలియాపై గడ్డపై ఆడనున్నాడు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 3 వరకు బ్రిస్బేన్‌లో భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా అండర్–19 జట్ల మధ్య మొట్టమొదటి మల్టీ–డే మ్యాచ్ జరుగుతోంది. మ్యాచ్ మొదటి రోజున, ఆస్ట్రేలియా ముందుగా బ్యాటింగ్ చేసి 243 పరుగులు చేసింది. దీంతో, మొదటి రోజు ఆట ముగిసింది. ఇప్పుడు, అక్టోబర్ 1, 2025న, భారత అండర్–19 జట్టు తమ మొదటి ఇన్నింగ్స్ కోసం మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు, అందరి దృష్టి వైభవ్ సూర్యవంశీపై ఉంటుంది.

## ఆసియా కప్ ట్రోఫీతో పారిపోయిన పాకిస్థాన్ మంత్రి

పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఆసియా కప్ ఆడిన భారతదేశం, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్తాన్ అంతర్గత మంత్రి కూడా అయిన మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోవడానికి నిరాకరించింది. భారత వైమానిక జెట్లను కాల్చివేసినట్లు తన దేశం చేసిన వాదనను ప్రస్తావిస్తూ, ఇటీవల ఆయన రెచ్చగొట్టే ట్వీట్ కూడా చేశారు. అంతేకాకుండా ఉగ్రవాద భావజాలంతో భారతీయ పౌరులను పొట్టన పెట్టుకున్న పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పడానికి వారితో కరచాలనం, ట్రోఫీ అందుకోవడానికి నిరాకరించింది. ఏ ఇతర అధికారి నుంచైనా ట్రోఫీని స్వీకరించడానికి మెన్ ఇన్ బ్లూ సిద్ధంగా ఉందని స్పష్టంగా చెప్పింది. కానీ నఖ్వీ మాత్రం స్పందించలేదు. దీని ఫలితంగా విజేత జట్టుకు కప్ ఇవ్వలేదు. పాకిస్తాన్ తన కపట బుద్ధి చూపించుకున్నా సరే భారత జట్టు వేడుకలకు వెనుకాడలేదు. 'ఊహాత్మక ట్రోఫీ'తో సెలబ్రేషన్స్ చేసుకుంది. ఆన్‌లైన్ ఎమోజీలను వాడుకొని అభిమానులకు ఆనందాన్ని పంచింది. 2024 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ విజయాన్ని రోహిత్ శర్మ ఆసక్తికరంగా జరుపుకున్నాడు, 2022లో ఫిఫా ప్రపంచ కప్ గెలిచిన తర్వాత లియోనెల్ మెస్సీ ట్రోఫీ వాక్‌ను గుర్తుకు తెచ్చింది. ఆసియా కప్ గెలిచిన తర్వాత సూర్యకుమార్ యాదవ్ ఆ సెలబ్రేషన్ శైలిని అనుకరించాడు. పాకిస్తాన్ మంత్రి కప్ ఇవ్వకుండా వెళ్లిపోయినా ఊహాత్మక కప్‌తో ఆ వాక్‌ను గుర్తు చేశాడు. చేతిలో ట్రోఫీ లేకపోవడం విజేత జట్టు మానసిక స్థితిని దెబ్బతీసినట్లు కనిపించడం లేదు. అన్నింటికంటే, ఒక ప్రధాన పోటీ ఫైనల్‌లో ఒకరి ప్రధాన ప్రత్యర్థిపై ఉత్కంఠభరితమైన విజయం తర్వాత ఇలాంటిది చాలా చిన్నది అయిపోతుందని. అదే టీమిండియా ఆటగాళ్లలో కూడా కనిపించాం. చిరకాల ప్రత్యర్థినిపై ఉత్కంట పోరులో గెలిచిన ఆత్మవిశ్వాసం, ఆనందం వారిలో కనిపించింది.

## అత్యంత ఒడిదుడుకులతో సాగిన తిలక్ వర్మ కెరీర్

నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. పహల్గాం ఉగ్రదాడిలో భారతీయ వనితల తిలకాన్ని పాక్ ఉగ్రమూక తుడిచేస్తే..ఆసియా కప్ 2025 టోర్నీ ఫైనల్లో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ తెలుగు తేజం భారత్‌కు విజయ తిలకాన్ని దిద్దాడు. అయితే ఈ మ్యాచ్ తర్వాత సోషల్ మీడియా వేదికగా ఓ మాట బాగా వైరల్ అయ్యింది.పాకిస్థాన్ జట్టు అభిషేక్ శర్మ కోసం బాగా ప్రిపేర్ అయ్యి ఔట్ చేస్తే.. ఔటాఫ్ సిలబస్‌లా తిలక్ వర్మ దూసుకొచ్చి విజయాన్ని అందించాడు. పాక్ మాజీ క్రికెటర్లు సైతం అభిషేక్ శర్మను ఔట్ చేస్తే మ్యాచ్ గెలిచినట్లేనని పాక్ ఆటగాళ్లకు నూరిపోసారు. అలానే అభిషేక్ శర్మను ఔట్ చేసిన అనంతరం పాకిస్థాన్ సంబరాలు చేసుకుంది. కానీ తిలక్ వర్మ మాత్రం చివరి వరకు నిలబడి.. పాక్ ఆశలను గల్లంతు చేశాడు.హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఐపీఎల్‌లో గత నాలుగు సీజన్లుగా ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడుతున్నాడు. ఈ ఏడాదే ఇంగ్లండ్ కౌంటీల్లోకి అడుగుపెట్టాడు. హాంప్‌షైర్ తరపున బరిలోకి దిగాడు. 2023లో అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే అందరి క్రికెటర్లలానే అతని క్రికెట్ జర్నీ కూడా అంత సాఫీగా ఏమీ సాగలేదు. ఒక లోయర్ మిడిల్ క్లాస్ కుటుంబంలో పుట్టిన తిలక్ వర్మ కెరీర్ అత్యంత ఒడిదుడుకులతో సాగింది.నంబూరి నాగరాజు, గాయత్రి దేవి దంపతులకు ఇద్దరు కుమారులు. అందులో చిన్నవాడే తిలక్ వర్మ. నాగరాజు ఒక సాధారణ ఎలక్ట్రీషియన్. తన కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టపడ్డాడు. తిలక్ వర్మకు చిన్నతనం నుంచే క్రికెట్ అంటే ఇష్టం. అందరి కుర్రాళ్లలానే సరదాగా క్రికెట్ ఆడేవాడు. అయితే తన 11వ ఏట టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడుతున్న తిలక్ వర్మను సలామ్ బయాష్ అనే క్రికెట్ కోచ్ చూశాడు. 11 ఏళ్ల వయసులోనే అద్భుతంగా ఆడుతున్న తిలక్ వర్మను చూసి ఫిదా అయ్యాడు. అతని ప్రతిభను గుర్తించిన సలామ్ బయాష్ క్రికెటర్‌గా మంచి కెరీర్ ఉంటుందని తండ్రి నంబూరి నాగరాజుకు చెప్పాడు. కానీ తిలక్ వర్మ కోచింగ్ కోసం ఖర్చు చేసే స్థోమత తనకు లేదని ఆయన అన్నాడు. అయితే కోచ్ సలామ్ బయాష్.. ఆ ఖర్చులన్నీ తానే భరిస్తానని చెప్పి నాగరాజును ఒప్పించాడు.సలామ్ కోచ్‌గా పని చేస్తున్న లీగాలా క్రికెట్ అకాడమీలో తిలక్ వర్మను తన సొంత ఖర్చుతో చేర్పించాడు. అంతే కాకుండా తిలక్‌కు అవసరమైన కిట్, ఇతర సామాగ్రితో పాటు రవాణ ఖర్చులను కూడా సలామ్ భరించాడు. తిలక్ వర్మ 11వ ఏట నుంచి సలామ్ బయాష్ అన్నీ తానై చూసుకున్నాడు. తిలక్‌కు ఒక మెంటార్‌లా వ్యవహరించి.. ఒక మంచి బ్యాటర్‌గా తీర్చిదిద్దాడు. కొడుకు బాగా ఆడుతున్నాడనే విషయాన్ని గ్రహించిన నాగరాజు.. అతని కోచింగ్ కోసం మరింత కష్టపడ్డాడు. కొడుకు కావాల్సిన ఇతర అవసరాలను చూసుకున్నాడు. వారిద్దరి నమ్మకాన్ని నిలబెట్టుకున్న తిలక్ వర్మ ఏజ్ క్రికెట్‌లో సత్తా చాటి హైదరాబాద్ రంజీ జట్టులోకి ఎంట్రీ ఇచ్చాడు.తిలక్ ప్రతిభను గుర్తించిన ముంబై ఇండియన్స్ అతన్ని వేలంలో కొనుగోలు చేసింది. అప్పటి నుంచి తిలక్ వర్మ వెనుదిరిగి చూసుకోలేదు. ముంబై జట్టు కారణంగా ఆర్థిక సమస్యలు తొలిగిపోయాయి. ఐపీఎల్‌లో తిలక్ సత్తా చాటడంతో టీమిండియా పిలుపు కూడా దక్కింది. పొట్టి ఫార్మాట్‌లో తనదైన శైలిలో చెలరేగిన తిలక్.. జట్టులో తన స్థానాన్ని సుస్థీరం చేసుకున్నాడు. పాకిస్థాన్‌తో ఫైనల్లో తీవ్ర ఒత్తిడిలో బ్యాటింగ్ చేసి చిరస్మరణీయ విజయాన్నందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో తిలక్ వర్మ ఇతర ఫార్మాట్లలోకి కూడా ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. కోచ్ సలామ్ బయాష్ కారణంగా తిలక్ వర్మ ఈ రోజు సూపర్ స్టార్‌గా నిలబడ్డాడు.

## రౌఫ్‌పై ఆ దేశ మాజీ క్రికెటర్ వసీమ్ అక్రమ్ విమర్శలు

పాకిస్థాన్ పేసర్ హరిస్ రౌఫ్‌పై ఆ దేశ మాజీ క్రికెటర్ వసీమ్ అక్రమ్ విమర్శలు గుప్పించాడు. అతని కారణంగానే ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్ ఓటమిపాలైందని చెప్పాడు. అతను కాస్త కట్టడిగా బౌలింగ్ చేసుంటే భారత్‌పై పాకిస్థాన్ గెలిచేదని అభిప్రాయపడ్డాడు. ఆదివారం జరిగిన ఆసియా కప్ 2025 ఫైనల్లో టీమిండియా 5 వికెట్ల తేడాతో పాకిస్థాన్ ఓడించిన సంగతి తెలిసిందే. ఒకే ఎడిషన్‌లో పాకిస్థాన్‌ను మూడు సార్లు ఓడించి టీమిండియా ఛాంపియన్‌గా నిలిచింది. ఓటమెరుగని జట్టుగా 9వసారి ఆసియా కప్ విజేతగా నిలిచింది.ఈ మ్యాచ్‌లో హరిస్ రౌఫ్ 3.4 ఓవర్లు బౌలింగ్ చేసి 50 పరుగులు సమర్పించుకున్నాడు. కనీసం ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. మిగతా బౌలర్లంతా కలిపి 100 పరుగులిస్తే.. అతనొక్కడే 50 రన్స్ ఇచ్చుకున్నాడు. అతని వైఫల్యమే పాకిస్థాన్ కొంపముంచింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన వసీమ్ అక్రమ్.. హరిస్ రౌఫ్‌కు పలు ఘాటైన సూచనలు చేశాడు. రెడ్ బాల్ క్రికెట్ ఆడాలని, లేకుంటే ఆట నుంచి తప్పుకోవాలని హితవు పలికాడు. దురదృష్టవశాత్తూ హరిస్ రౌఫ్ బౌలర్‌గా రన్‌మెషీన్ అయ్యాడు. ముఖ్యంగా భారత్‌తో మ్యాచ్ అనగానే ధారళంగా పరుగులు ఇచ్చుకుంటున్నాడు. నేను ఒక్కడినే అతన్ని విమర్శించడం లేదు. దేశం మొత్తం అతన్ని తిట్టని తిట్లు తిడుతోంది. అతను టెస్ట్ ఫార్మాట్ ఆడటం లేదు. ఆటలోనూ మెరుగవ్వడం లేదు. కనీసం నాలుగు, ఐదు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లైనా ఆడాలి. రెడ్ బాల్ క్రికెట్ ఆడనప్పుడూ జట్టులో కొనసాగకూడదు. పీసీబీ కూడా ఈ విషయంలో కఠినంగా ఉండాలి. రెడ్ బాల్ క్రికెట్ ఆడని ఆటగాళ్లను జట్టు నుంచి తీసేయాలి.'అని వసీమ్ అక్రమ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. అతని వ్యాఖ్యలతో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వకార్ యూనిస్ సైతం ఏకీభవించాడు. సల్మాన్ అలీ అఘా కెప్టెన్సీ కూడా సరిగా లేదని వసీమ్ అక్రమ్ చురకలంటించాడు. అతని అనాలోచిత నిర్ణయాలు కూడా ఓటమికి కారణమయ్యాయని చెప్పాడు.హరిస్ రౌఫ్ 15వ ఓవర్‌లో 17 పరుగులు ఇచ్చుకోవడం ఫైనల్ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. 18వ ఓవర్‌లో 13 పరుగులు ఇచ్చిన రౌఫ్.. ఆఖరి ఓవర్‌లో4 బంతుల్లో 12 పరుగులు ఇచ్చుకున్నాడు. 2022 టీ20 ప్రపంచకప్‌లోనూ హరిస్ రౌఫ్ బౌలింగ్‌లోనే కోహ్లీ సిక్స్‌లు బాది చిరస్మరణీయ విజయాన్నందించాడు. అతని బౌలింగ్‌లో కోహ్లీ కొట్టిన సిక్స్‌లు ఆ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఇప్పటి వరకు భారత్‌పై ఆడిన ఏడు టీ20ల్లో హరిస్ రౌఫ్ 8.66 ఎకానమీ, 25.66 సగటుతో 231 పరుగులు సమర్పించుకున్నాడు. హరిస్ రౌఫ్‌పై భారత అభిమానులు కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. 'ఆట తక్కువ.. ఎక్స్‌ట్రా ఎక్కువ'అని కామెంట్ చేస్తున్నారు.

## రౌఫ్ చెత్త బౌలింగ్ కారణంగానే టీమిండియా విజయం


పాకిస్థాన్ పేసర్ హరిస్ రౌఫ్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సెటైర్లు పేల్చాడు. తిలక్ వర్మ, భారత జట్టు అద్భుత ప్రదర్శన కంటే హరిస్ రౌఫ్ చెత్త బౌలింగ్ కారణంగానే టీమిండియా విజయం సాధించిందని విమర్శలు గుప్పించాడు. ఇందుకు హరిస్ రౌఫ్‌కు అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా కృతజ్ఞతలు కూడా చెప్పాడు.ఈ మ్యాచ్‌లో 3.4 ఓవర్లు వేసిన హరిస్ రౌఫ్ 50 పరుగులు సమర్పించుకున్నాడు. మిగతా బౌలర్లంతా కలిసి 100 పరుగులిస్తే అతనొక్కడే 50 పరుగులు ఇచ్చుకోవడం పాకిస్థాన్ విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌పై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. తిలక్ వర్మతో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్‌లపై ప్రశంసల జల్లు కురిపించాడు. 'తిలక్ వర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. కఠిన సమయంలో తీవ్ర ఒత్తిడిని తట్టుకొని అతను చక్కగా రాణించాడు.మేం చాలా తేలిగ్గా మ్యాచ్ గెలిచాం. ఇందుకు హరిస్ రౌఫ్‌కు థ్యాంక్స్ చెప్పాలి. తిలక్ వర్మ స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. స్వీప్ షాట్స్ బాగా ఆడాడు. బంతిని గాల్లోకి లేపకుండా నేల మీదుగానే కొట్టి పరుగులు రాబట్టాడు. పిచ్‌కు తగ్గట్లుగా చాలా తెలివిగా బ్యాటింగ్ చేశాడు. ముఖ్యంగా అతని షాట్ల ఎంపిక అద్భుతం. హరిస్ రౌఫ్ వేసిన ఆఖరి ఓవర్‌లో తిలక్ వర్మ కొట్టిన సిక్స్ అంత తేలిక కాదు. ఆ షాట్ ఆడటం చాలా కష్టం. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. వారి వల్లే భారత్ ఈ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఫర్హాన్, ఫకార్ జమాన్ పాకిస్థాన్‌కు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే ఆ తర్వాతి బ్యాటర్లు దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. పాకిస్థాన్, శ్రీలంక జట్లకు ఉన్న తేడా ఇదే. శ్రీలంక బ్యాటర్లు భారత స్పిన్నర్లను అద్భుతంగా ఎదుర్కొన్నారు. పాక్ బ్యాటర్లతో పోల్చితే వారి షాట్ల ఎంపిక కూడా బాగుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

# అమాంతం బరువు తగ్గిన రోహిత్ శర్మ

భారత క్రికెట్ జట్టుకు అద్భుతమైన కెప్టెన్‌లలో రోహిత్ శర్మ ఒకరు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు చిరస్మరణీయ విజయాలు అందించి సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు. టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన హిట్‌మ్యాన్ 2027 ప్రపంచకప్ వరకు వన్డే క్రికెట్‌లో కొనసాగాలని భావిస్తున్నాడు. అనంతరం క్రికెట్ నుంచి వైదొలగాలననే ప్రణాళికలో రోహిత్ ఉన్నాడు. అతడి క్రికెట్ పక్కనపెడితే రోహిత్ శర్మ బరువు తగ్గాడనే వార్త వైరల్‌గా మారింది. ఏకంగా 20 కిలోల బరువు తగ్గాడని.. స్లిమ్ అయ్యాడని చర్చ జరుగుతోంది. కొంతకాలంగా రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై చర్చ జరుగుతోంది. రోహిత్ ఫిట్‌గా లేడని.. ప్రదర్శన




పేలవంగా ఉందని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్ తర్వాత విరాట్, రోహిత్‌లను వన్డే జట్టు నుంచి తప్పించేందుకు బీసీసీఐ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 2027 ప్రపంచకప్ టోర్నీకి శుభ్‌మన్ గిల్ సారథ్యంలో జట్టు వెళ్తుందనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఫిట్‌నెస్ లేని రోహిత్ శర్మతో ఐసీసీ వన్డే ట్రోఫీ కష్టమనే అభిప్రాయం నేపథ్యంలో హిట్‌మ్యాన్ తన ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. 2024 శ్రీలంక వన్డే సిరీస్ పూర్తి చేయడానికి ముందు రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాడు. రోహిత్ శర్మ తన శరీరాన్ని తిరిగి ఫిట్‌గా మార్చుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాడని తెలుస్తోంది. ఇటీవల మాజీ కోచ్ అభిషేక్ శర్మతో కలిసి బెంగళూరులోని ఎన్‌సీఏలో జరిగిన ఫిట్‌నెస్ పరీక్షలో రోహిత్ శర్మ పాల్గొని ఉత్తీర్ణుడయ్యాడు. ఇప్పుడు అతను పూర్తి ఫిట్‌నెస్‌ను తిరిగి పొందాడనే వార్త అతడి అభిమానులను సంతోషపరుస్తోంది. ఈ క్రమంలో రోహిత్ శర్మ దాదాపు 20 కిలోల బరువు తగ్గాడని తెలుస్తోంది. 95 కిలోల నుంచి 75 కిలోలకు చేరాడని సమాచారం. ఇటీవల రోహిత్ శర్మ బయట కనిపించిన వీడియో వైరల్ గా మారింది.




# బిగ్‌బాష్ లీగ్‌లోకి అశ్విన్ ఎంట్రీ




భారత క్రికెట్?లో ఇప్పటివరకు ఎంతోమంది లెజెండరీ ప్లేయర్స్ వేర్వేరు ఫార్మాట్లలో తమ ముద్ర వేశారు. కానీ ఐపీఎల్?కి గుడ్‌బై చెప్పిన కొద్ది రోజుల్లోనే మరో అంతర్జాతీయ లీగ్?లో అడుగుపెట్టే అవకాశాలు వస్తే ఎలా ఉంటుంది? ఇదే ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో హాట్ టాపిక్ అయింది. రవిచంద్రన్ అశ్విన్ లాంటి లెజెండరీ బౌలర్ ఐపీఎల్? తర్వాత, భారీ క్రేజ్?తో కొనసాగుతున్న ఒక విదేశీ లీగ్?లో ఆడవచ్చని సమాచారం బయటకు రావడంతో ఆసక్తి మరింత పెరిగింది. ఒకవేళ ఇది నిజమైతే ఇండియన్ క్రికెట్ చరిత్రలో కొత్త కొత్త ట్రెండ్ ప్రారంభం అయినట్లే! ఇది అభిమానుల్లో ఆసక్తి, ఆత్రుతను పెంచుతోంది. అశ్విన్ పేరు వినగానే అందరికీ





గుర్తొచ్చేది అతని మ్యాజికల్ ఆఫ్ స్పిన్. టెస్ట్ క్రికెట్?తోపాటు, ఐపీఎల్?లోనూ తన ప్రతిభను నిరూపించుకున్న ఈ ఆటగాడు ఎప్పుడూ సరికొత్త ట్రిక్స్?తో ప్రత్యర్థులను కంగారు పెడతాడు. అశ్విన్ 2011 వరల్డ్ కప్ టీమ్?లో కూడా ఉన్నాడు. తరువాతి దశల్లో భారత క్రికెట్?లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఐపీఎల్?లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తరఫున తన ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో తన అద్భుత ప్రదర్శనతో ఆయా జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 38 ఏళ్ల వయసులో కూడా క్రికెట్ పట్ల చూపుతున్న ప్యాషన్ నిజంగా ప్రేరణాత్మకం. క్రికెట్ వరల్డ్?లో ఐపీఎల్ తర్వాత అత్యంత ఆదరణ ఉన్న టోర్నీ 'బిగ్?బాష్ లీగ్'. క్రికెట్ ఆస్ట్రేలియా ఈ లీగ్?ను ప్రతీ ఏడాది డిసెంబర్– జనవరిలో నిర్వహిస్తుంది. సాధారణంగా భారత ఆటగాళ్లు విదేశీ లీగుల్లో ఆడటానికి అనుమతి లేదు. అలా ఆడాలి అనుకుంటే పూర్తిస్థాయిలో ఇండియన్ క్రికెట్?కు దూరం కావ్సల్సిందే. బీసీసీఐ కి సంబంధించిన ఎలాంటి లీగ్స్, టోర్నీలలో ఆడటానికి వీలుండదు. అయితే అశ్విన్ ఇటీవల ఐపీఎల్ కు రిటైర్మెంట్ ఇచ్చాడు. దీంతో అతనికి ఫారిన్ లీగుల్లో ఆడేందుకు అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఫారిన్ లీగ్? ఫ్రాంచైజీల నుంచి అశ్విన్?కు ఆఫర్లు వస్తున్నట్లు తెలుస్తోంది. రీసెంట్?గా ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు సీఈఓ టాడ్ గ్రీన్‌బర్గ్ ఇప్పటికే అశ్విన్?తో సంప్రదింపులు జరిపారని వార్తలు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ "అశ్విన్ లాంటి ఛాంపియన్ ఆటగాడు మా బిగ్?బాష్ లీగ్ కి వస్తే ఆస్ట్రేలియా క్రికెట్?కు లాభం" అని అన్నారు. అతడి అనుభవం, ప్రఖ్యాతి బీబీఎల్? స్థాయి పెంచుతుందని నమ్ముతున్నారు. కానీ సమస్య ఏమిటంటే, ఇప్పటికే ఎక్కువ జట్లు తమ బడ్జెట్?ను పూర్తిస్థాయిలో వినియోగించాయి. అందువల్ల ప్రత్యేక కాంట్రాక్టులు, స్పాన్సర్ ఆధారిత డీల్స్ ద్వారా అశ్విన్?ను తీసుకోవాలని బోర్డు ప్రయత్నిస్తోంది. ఆటగాడిగా మాత్రమే కాకుండా కోచ్?గా, క్రికెట్ అనాలిస్ట్?గా కూడా అశ్విన్ తన భవిష్యత్?ను నిర్మించుకోవాలని అనుకుంటున్నాడు. ఇప్పటికే తన పాడ్‌కాస్ట్?ల ద్వారా అభిమానులతో నేరుగా కనెక్ట్ అవుతూ ఉన్నాడు. బీబీఎల్ లాంటి లీగ్?లో ఆడటం ద్వారా కోచింగ్?లోనూ కొత్త విషయాలు నేర్చుకోవచ్చని, మీడియా రోల్స్ లో కూడా అవకాశాలు వెతుక్కోవచ్చని భావిస్తున్నాడు. ఇది కేవలం ఒక లీగ్?లో ఆడటమే కాకుండా, భవిష్యత్తులో క్రికెట్?లోనే ఓ రోల్ సంపాదించుకోవచ్చు! ఇప్పుడు అభిమానుల మదిలో ఉన్న ప్రధాన ప్రశ్న, అశ్విన్ బీబీఎల్?లో ఏ జట్టు తరఫున ఆడతాడు? మెల్బోర్న్ స్టార్స్ లేదా రెనిగేడ్స్ జట్లు అశ్విన్?ను తీసుకోవచ్చని చెబుతున్నారు. ఇది జరిగితే బీబీఎల్?కు దక్షిణాసియా మార్కెట్?లో మంచి రెస్పాన్స్ ఉంటుంది. అతని అడుగులు ఇతర భారత ఆటగాళ్లకు కూడా మార్గం చూపే అవకాశం ఉంది. ఐపీఎల్ తర్వాత కెరీర్ కొనసాగించాలనుకునే వారికి ఇది ప్రేరణగా నిలుస్తుంది. మొత్తంగా చూస్తే, అశ్విన్ బీబీఎల్?లో అడుగు పెడతాడా లేదా అనేది ఇంకా క్లారిటీ రాలేదు. కానీ ఆయన పేరు వినిపించడం కూడా లీగ్?కు కొత్త ఊపు తీసుకువచ్చింది. ఇది ఒక ఆటగాడి వ్యక్తిగత ప్రయాణం మాత్రమే కాదు, భారత క్రికెట్ భవిష్యత్తులో ఒక కొత్త ట్రెండ్ కూడా కావచ్చు. అశ్విన్ అడుగులు ఇతర ఇండియన్ స్టార్లకు దారి చూపవచ్చు. మరి అతని నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.





# సంబరాల్లో విషాదంపై విరాట్ కోహ్లీ ఎమోషనల్ పోస్ట్

క్రికెట్ ఆటకు భారతదేశంలో ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ మరెక్కడా లేదని చెప్పవచ్చు! ముఖ్యంగా యువతరం ఎంతో ఇష్టపడే క్రికెట్, జీవితంలో ఒక ఏమోషన్?గా మారిపోయింది. %ఖ్రూ%తో అభిమానం మరింత పెరిగింది. ముఖ్యంగా ఎన్నో ఏళ్ల ఎదురుచూపుల తర్వాత ఒక ఫ్రాంచైజీ ట్రోఫీ గెలిస్తే అది మరింత ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి సందర్భం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు 2024లో వచ్చింది. కానీ ఆ విజయ సంబరాలు విషాదంలో ముగిసాయి. కోట్ల మంది ఫ్యాన్స్ ఆనందంలో మునిగిపోతుంటే, చరిత్రలో నిలిచిపోయేలా ఒక దుర్ఘటన చోటుచేసుకుంది. ఇక ఆ ఘటనపై విరాట్ కోహ్లీ తాజాగా ఒక వివరణ ఇవ్వడం వైరల్ అవుతోంది. 2024 జూన్ 4న బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ తొలి ఐపీఎల్ ట్రోఫీ విజయోత్సవం జరిగింది. దాదాపు 2.5 లక్షల మంది అభిమానులు ఒకేచోట



గుమికూడారు. ఆనందం, కేరింతలు, పాటలు అన్నీ నడుస్తున్న వేళ ఒక్కసారిగా నియంత్రణ తప్పింది. జనసంద్రంలో గందరగోళం ఏర్పడి తొక్కిసలాట జరిగింది. ఆ క్షణాల్లోనే 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. ఒక టీమ్ సెలబ్రేషన్స్?తో పండుగ కావాల్సిన సందర్భం విషాద వాతావరణం సృష్టించింది. ఆ రోజు జరిగిన దుర్ఘటనపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. నివేదికల ప్రకారం, సరైన అనుమతులు లేకుండా భారీగా ప్రజలను ఆహ్వానించడం, తగిన సెక్యూరిటీ లేకపోవడం ప్రధాన కారణాలుగా తేలింది. సోషల్ మీడియా ద్వారా ఆర్సీబీ విస్తృతంగా ఫ్యాన్స్‌కి ఆహ్వానం పంపినందు వల్లనే జనాలు అధికంగా వచ్చారని అధికారులు చెప్పారు. పోలీసులు కూడా తక్కువ సంఖ్యలో ఉండటం వల్ల గుమికూడిన జనాన్ని కంట్రోల్ చేయలేకపోయారని అంగీకరించారు. ఫలితంగా ఫ్రాంచైజీనే బాధ్యత వహించాలని విమర్శలు వచ్చాయి. ఆర్సీబీలో ప్రధాన ఆటగాడిగా ఉన్న విరాట్ కోహ్లీ, ఆ ఉత్సవాల్లో ముఖ్య పాత్ర పోషించాడు. కానీ ఈ ఘటన తర్వాత ఆయన మనసు బరువెక్కింది. "మన ఫ్రాంచైజీ చరిత్రలో అత్యంత సంతోషకరమైన రోజు విషాదంగా మారింది. ఆ రోజు జీవితంలో మరచిపోలేని బాధ" అని అన్నారు. "ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం నేను ప్రార్థిస్తున్నాను. వారి నష్టం ఇప్పుడు మన జట్టు కథలో భాగం. ఇక నుంచి జాగ్రత్త, గౌరవం, బాధ్యతతో ముందుకు వెళ్తాం" అని కోహ్లీ అన్న మాటలు అభిమానుల హృదయాలను కదిలించాయి. ఈ విషాదం తర్వాత ఆర్సీబీ ఫ్రాంచైజీ వెంటనే చర్యలు తీసుకుంది. మరణించిన వారి కుటుంబాలకు 25 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. "ఆర్సీబీ కేర్స్" పేరుతో ఒక ఫౌండేషన్‌ను కూడా ప్రారంభించింది. దీని ద్వారా భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసే చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చింది. స్టేడియం అధికారులు, లీగ్ నిర్వాహకులు, పోలీసులు కలిసి భద్రతా మార్గదర్శకాలు కఠినంగా పాటించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని స్పష్టం చేసింది. ఆ రోజు జరిగిన విషాదం ఇంకా అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఒకవైపు తమ జట్టు విజయంపై గర్వం, మరోవైపు నిరపరాధుల ప్రాణనష్టం పై బాధ. ఇక విరాట్ కోహ్లీ స్పందన, ఆర్సీబీ చర్యలు అభిమానులకు కొంత ఊరటనిచ్చాయి. కానీ ఆ రోజు సంబరాల్లో కలిసిన కన్నీటి జ్ఞాపకం మాత్రం ఎప్పటికీ మరవలేనిది. ఇకనైనా ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి అని ఫ్యాన్స్ రిక్వెస్ట్ చేస్తున్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక





# అశ్లీలతకు తావు లేకుండా..

రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్టైనర్ 'శశివదనే'. సాయిమోహన్ ఉబ్బన దర్శకుడు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి గోడల నిర్మాతలు. ఈ నెల 10న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. తండ్రికొడుకుల అనుబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన సినిమా ఇదని, ఇందులోని గోదావరి అందాలు విజువల్ ఫీస్ట్‌గా ఉంటాయని, సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా ఆకట్టుకుంటుందని, కథానాయిక కోమలికి ఈ సినిమా మంచి బ్రేక్‌గా నిలుస్తుందని, అశ్లీలతకు తావు లేకుండా ఈ సినిమా చేశామని హీరో రక్షిత్ అట్లూరి తెలిపారు. ఇదొక అందమైన పెయింటింగ్ లాంటి సినిమా అనీ, కచ్చితంగా అందరికీ నచ్చుతుందని దర్శకుడు సాయిమోహన్ అన్నారు. ఆడియన్స్‌కి మంచి అనుభూతినిచ్చే సినిమా 'శశివదనే' అనీ, ఈ సినిమా ఎవరినీ నిరాశపరచదనీ నిర్మాత అహితేజ నమ్మకం వ్యక్తం చేశారు. అందరూ ప్రాణం పెట్టి చేసిన సినిమా ఇదని కథానాయిక కోమలి ప్రసాద్ పేర్కొన్నారు. ఇంకా డీవోపీ సాయికుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్, నటి అంబిక కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సమర్పణ: గౌరీ నాయుడు.

# ఓ చెలియా.. ఓ గాఢమైన ప్రేమకథ



నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ప్రేమకథాచిత్రం 'ఓ చెలియా..'. ఎం.నాగరాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. రూపాశ్రీ కొపురు నిర్మాత. నిర్మాణంలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానున్నది. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. ప్రచారంలో భాగంగా ఈ సినిమా నుంచి మరో మెలొడీని మేకర్స్ విడుదల చేశారు.కొంచెం కొంచెంగా..' అంటూ సాగే ఈ పాటను హీరో నవీన్‌చంద్ర ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. సుధీర్ బాగడి ఈ పాట రాయగా, ఎం.ఎం.కుమార్ స్వరపరిచారు. వాగ్దేవి, మనోజ్ ఆలపించారు. హీరోహీరోయిన్ల మధ్య గాఢమైన ప్రేమను ఆవిష్కరించేలా ఈ పాట సాహిత్యం, సంగీతం సాగింది. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ బాలా, నిర్మాణం: ఎస్ఆర్ఎస్ క్రియేషన్స్, ఇందిరాదేవి ప్రొడక్షన్స్.



# హై ఓల్టేజ్ మారియో

అనిరుధ్, హెబ్బాపటేల్ జంటగా రూపొందుతున్న యాక్షన్ ప్యాక్డ్ ట్కస్టైలిష్ ఎంటైర్టైనర్ 'మారియో'. 'ఎ టర్బో చార్జ్‌డ్ ర్యాంప్ రైడ్' అనేది ఉపశీర్షిక. సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్స్, రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి కల్యాణ్ జీ గోగణ దర్శకుడు. దసరా పర్వదినం సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు.హీరోహీరోయిన్ల మధ్య ఉన్న కెమిస్ట్రీకి అద్దం పట్టేలా ఈ పోస్టర్ డిజైన్ చేశారు. హెబ్బా పటేల్ ఎరుపురంగు దుస్తుల్లో డైనమిక్‌గా కనిపిస్తుంటే, అనిరుధ్ రైఫిల్ పట్టుకొని హై ఓల్టేజ్ లుక్‌లో దర్శనమిస్తున్నారు. సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించే చిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: రాకేందు మౌళి, కెమెరా: ఎం.ఎన్.రెడ్డి, సంగీతం: సాయికార్తీక్, రాకేందు మౌళి.

# సింగరేణి నేపథ్యంలో



'మొగిలిరేకులు'ఫేం సాగర్ హీరోగా ఓ విభిన్న కథాచిత్రం తెరకెక్కనున్నది. సింగరేణి కార్మికుల జీవితాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందించనున్నట్టు శనివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. 'జార్జి రెడ్డి' ఫేం జీవన్‌రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు.తెలంగాణ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని, సింగరేణి కార్మికుల కష్టాలు, పోరాటాలు, ఆశలు, అనుబంధాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందించనున్నామని, పానిండియా స్థాయిలో ప్రేక్షకులందరూ ఓ కొత్త అనుభూతికి లోనయ్యేలా ఈ సినిమా కథాంశం ఉంటుందని, మైనింగ్ ప్రాంతాల్లోని కఠినమైన వాతావరణం, కార్మికుల దినచర్యలు, వారి త్యాగాలు ఈ కథలో ప్రధానంగా ఉంటాయని, ఈ సినిమాలో సాగర్‌తోపాటు మరో ప్రముఖ హీరో కూడా నటిస్తారని దర్శకుడు తెలిపారు. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నది. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు.



# బాబా బాబా బ్లాక్ షీప్

గన్స్, గోల్డ్ చుట్టూ సాగే హంట్ నేపథ్యంలో.. ఓ ముగ్గురి ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కనున్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ డ్రామా 'బాబా బాబా బ్లాక్ షీప్'. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి ప్రధాన పాత్రధారులు. గుణి మంచికంటి దర్శకుడు. వేణు దోణెపూడి నిర్మాత. దసరా సందర్భంగా ఈ సినిమా కాన్సెప్ట్‌ని పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. క్రియేటివ్ డైరెక్టర్ తరుణ్‌భాస్కర్ ఈ పోస్టర్‌ని ఆవిష్కరించి చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు.ఇది ఒకే రోజులో జరిగే కథ అని, ఓ ముగ్గురి ప్రయాణం చుట్టూ ఈ కథ నడుస్తుందని, ఈ ప్రయాణంలో ఎదురయ్యే పరిస్థితులు, ఆ పరిస్థితుల్లోనుంచి పుట్టే కామెడీ, ఈ జర్నీలో జరిగే క్రైమ్ ఇవన్నీ ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని కలిగిస్తాయని మేకర్స్ చెబుతున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్న ఈ చిత్రానికి కెమెరా: అజయ్ అబ్రహం జార్జ్, సంగీతం: స్టీఫెన్, ఆనంద్, సహనిర్మాత: కొండల్ జిన్నా, నిర్మాణం: చిత్రాలయం స్టూడియోస్.



# కష్టపడకుండా ఏదీ రాదు



'బయటనుంచి ఇండస్ట్రీకి వచ్చినవారి కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు. కానీ ఇండస్ట్రీలో పుట్టి ఇండస్ట్రీలో పెరిగినవాళ్ల కష్టాలు ఎవరూ వినరు.' అని శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ వాపోయారు. ఇటీవలే 'ఇన్‌సైడర్ వర్సెస్ అవుట్‌సైడర్' అనే చర్చలో పాల్గొన్న ఆమె పై విధంగా స్పందించారు. 'వీళ్లు బయట నుంచి వచ్చినవాళ్లు. వీళ్లు సినీ పరిశ్రమకు చెందిన వాళ్లు అని విభజించడం నాకిష్టం లేదు. ఇక్కడ ఎవరి కష్టాలు వాళ్లకుంటాయి.స్టార్ కిడ్స్ అయినంత మాత్రాన ఇబ్బందులు వుండవని ఎలా అంటారు? ఉన్నా మేం బయటపడం. ఎందుకంటే 'మేం కష్టపడుతున్నాం' అని చెబితే ఎవరూ నమ్మరు. బయటనుంచి వచ్చినవారు ఇక్కడ నిరూపించుకోవాలంటే ఎన్నో పోరాటాలు చేయాలని నేనూ అంగీకరిస్తా. కానీ కష్టపడకుండా ఎవరికీ ఏదీ రాదు. వారికైనా మాకైనా.. అది ఎవరైనా అంగీకరించాల్సిందే.' అంటూ చెప్పుకొచ్చారు

# సిమ్లా-మనాలికి ప్లాన్ చేస్తున్నారా..?

సంవత్సరానికి వెల్‌కం చెప్పేందుకు అందరూ రెడీ అవుతున్నారు. అయితే, చాలా మంది వినూత్నంగా న్యూ ఇయర్‌ను సెలబ్రేట్ చేసుకోవాలని భావిస్తుంటారు. స్నేహితులు, కుటుంబీకులతో కలిసి పార్టీలు జరుపుకోవడం లేదంటే విహార యాత్రలకు ప్లాన్ చేసుకుంటారు. ఈ క్రమంలో భారత్‌లోని అనేక పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. న్యూ ఇయర్ సందర్భంగా పర్యాటక ప్రాంతాలకు తాకిడి పెరుగుతుంటుంది. ఈ క్రమంలో ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్లాలనుకుంటే.. వెళ్లబోయే ప్రాంతానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకొని వెళ్లే సమయంతో పాటు పర్యటనను సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుంది. ఈ న్యూ ఇయర్‌కు హిమాచల్‌ప్రదేశ్‌లోని హిల్ స్టేషన్స్‌ను సందర్శించాలనుకుంటున్నారా..? అక్కడ హెూటల్స్ ఎంత ఖర్చవుతుంది ? సందర్శించాల్సిన ప్రాంతాలు ఏమున్నాయ్.. అక్కడి వాతావరణం ఎలా ఉంటుందో తెలుసుకుందాం రండి..!

## నూతన సంవత్సరంలో సిమ్లా-మనాలి పర్యటన..


శీతాకాలం సీజన్‌లో హిల్ స్టేషన్ల అందం మరింత పెరుగుతుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక హిల్ స్టేషన్లలో హిమపాతం కనిపిస్తుంది. మంచుతో కప్పబడిన ప్రాంతాలను చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. ప్రతి సంవత్సరం నూతన సంవత్సరం సమయంలో సిమ్లా-మనాలిలో పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. ఈ ఏడాది ఒక్క క్రిస్మస్ సందర్భంగా సిమ్లాలో ఒక్కరోజే 13 వేలకుపైగా వాహనాలు వచ్చాయి. ఇందులో 6వేలు సోలన్ నుంచి సిమ్లాకు, దాదాపు 3వేల వాహనాలు సిమ్లా నుంచి సోలాన్‌కు వెళ్లాయి. మనాలిలో సైతం దాదాపు పరిస్థితి ఉన్నది. పర్యాటకులతో కిటకిటలాడుతున్న సిమ్లా, మనాలిలో ట్రాఫిక్ జామ్ సమస్య ఎదురైంది. కొత్త సంవత్సరం సందర్భంగా ట్రాఫిక్ సమస్య ఎదురయ్యే అవకాశం ఉన్నది. వాహనాల్లో వెళ్లాలనుకుంటే మాత్రం వారాంతంలోపే పర్యాటక ప్రాంతాలకు చేరుకోవాలి. ఎక్కువ మంది పర్యాటకులు లేని ప్రదేశాలకు వెళ్తే కొత్త వేడుకలను ఆనందంగా జరుపుకునే వీలుంటుంది.

## సిమ్లా-మనాలి చేరుకోవడం ఎలా?

ఢిల్లీ నుంచి సిమ్లా దాదాపు 343 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఎనిమిది గంటల్లోనే అక్కడికి చేరుకోవచ్చు. రైలులో వెళ్లినట్లయితే కల్కా నుంచి రైలు మారాల్సి ఉంటుంది. రైలు మార్గంలో బరోగ్ సమీపంలో కిలోమీటర్ కంటే ఎక్కువగా విస్తరించి ఉన్న పొడవైన సొరంగం నుంచి అద్భుతమైన దృశ్యాలను వీక్షించేందుకు అవకాశం ఉంటుంది. ఢిల్లీ నుంచి మనాలికి దాదాపు 503 కిలోమీటర్లు. మనాలికి చేరుకునేందుకు 12 గంటల సమయం పడుతుంది. ఢిల్లీ నుంచి అంబాలా క్యాంట్ వరకు రైలు అందుబాటులో ఉంది. అక్కడ నుండి బస్సుల్లో మనాలికి చేరుకోవచ్చు.

## సిమ్లా-మనాలిలో హెూటల్ ఛార్జీలు

పర్యాటకుల సంఖ్య పెరగడంతో చాలా వరకు హెూటల్స్ న్యూ ఇయర్‌కు ముందుగానే బుకింగ్స్ అవుతున్నాయి. తక్కువ ధరల్లో హెూటల్స్ గదులు పొందడం కొంత కష్టంగా మారుతుంది.



శీతాకాలం సీజన్ కావడంతో పర్యాటకులు భారీగా వస్తుండడంతో హెూటళ్లలో రూమ్ ధరలు సైతం పెరుగుతున్నాయి. న్యూ ఇయర్‌కు ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్లనున్నట్లయితే.. ముందుగా ఆన్‌లైన్ హెూటల్ బుకింగ్ చేసుకుంటే బెటర్. తద్వారా అక్కడికి చేరుకున్న రూమ్‌ల కోసం తిరగాల్సిన పని ఉండదు. అదే సమయంలో ఎక్కువ ధర పెట్టాల్సిన అవకాశం రాకుండా ఉంటుంది. న్యూ ఇయర్ సందర్భంగా సిమ్లాలో హెూటల్ ఛార్జీ రూ.1,500 కంటే ఎక్కువగానే ఉంటుంది. మనాలిలో ఒకే రోజుకు రూ.1000 వరకు హెూటల్ గదులు అందుబాటులో ఉంటాయి. రద్దీ అధికంగా ఉన్న సమయంలో గదుల రేట్లను పెంచే అవకాశాలుంటాయి. ఈ క్రమంలో అడ్వాన్స్‌డ్ బుకింగ్ చేసుకుంటే ఇబ్బందులుండవు.



# భూసార పరీక్షలతో అధిక దిగుబడి

## మట్టి స్వభావం తెలుసుకునేందుకు మంచి అవకాశం

## ఇతర పంటల సాగుకు సమాయత్తమవుతున్న రైతులు

### వ్యవసాయశాఖ డివిజన్ అధికారి సత్యనారాయణ

రాష్ట్రంలో రైతులు వరికి బదులుగా ఇతర పంటలపై దృష్టి సారించాలని ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, ప్రచారం చేస్తున్నది. ముఖ్యంగా రైతులు ఆరుతడి పంటలైన కూరగాయలు, పప్పుదినుసులు సాగుచేయాలని ప్రభుత్వం తెలియజేస్తున్నందున ప్రతిరైతు తమ వ్యవసాయ పొలాల్లో అనుకూలంగా పండేపంటల వివరాలు తెలుసుకునేందుకు రైతులు తమ వ్యవసాయ పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని అనుకూలమైన పంటలను సాగుచేసుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించుకునేందుకు అవకాశముందని ప్రతిరైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుంటే ఎంతో మేలని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.రైతు తన పొలంలో అధిక దిగుబడి పొందాలన్నా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నా ముందుగా భూసార పరీక్షలు చేయించాలి. మట్టి స్వభావం తెలుసుకోవాలన్నా భూమిలో ఎలాంటి పంటలు పండించుకోవాలన్నా ఏయే ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవాలన్నా పరీక్ష ఫలితాలకు అనుగుణంగా వాడితే రైతుకు పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆశించిన దిగుబడులు వచ్చే అవకాశముంది.ప్రస్తుతం పంటల సాగుకోసం తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనా సేకరిస్తున్నారు. భూసార పరీక్ష వల్ల కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నారు. యాసంగి పంటల సాగు ప్రారంభంకానున్న నేపథ్యంలో భూసార పరీక్షలకు తరుణమిదేనని అధికారులు పేర్కొంటున్నారు. పంటలు సాగుచేసుకునే ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు.

## మట్టి నమూనా సేకరించే విధానం..

రైతు తన పొలంలో ఒక ఎకరంలో కనీసం ఆరు నుంచి ఎనిమిది చోట్ల ఆంగ్ల అక్షరం వీ(%ు%)ఆకారంలో ఆరు నుంచి ఎనిమిది అంగుళాల లోతు వరకు అంచు మట్టిని తీయాలి. సేకరించిన నమూనాలను బాగా కలిపి శుభ్రమైన గోనె సంచిలో తీసుకోవాలి. ఆ మట్టిని నీడలో పరిచిఆరబెట్టాలి. తర్వాత మట్టిని ఒక పొరగా చేసి నాలుగు భాగాలుగా విభజించాలి. మూలలకు ఎదురుగా ఉన్న మట్టిని తీసుకుని మిగిలిన మట్టిని పారేయాలి. ఇలా కనీసం అరకిలో మట్టి వచ్చే వరకు తీసుకోవాలి.ఇలా తీసుకున్న మట్టిని ఒక ప్లాస్టిక్ సంచిలో వేసి రైతు వివరాల వాటిలో ఉంచాలి. భూసార పరీక్షల కేంద్రానికి వ్యవసాయశాఖ అధికారి ద్వారా పంపించాలి. మట్టిని భూసార పరీక్ష కేంద్రంలో పరీక్ష చేసి మట్టిలో ఉన్న లవణాలు, సేంద్రియ కర్బనాలు, నత్రజని, భాస్వరం పొటాష్ తదితర పోషకాల స్థాయిని అధిక దిగుబడికి వాడాల్సిన ఎరువుల మోతాదును సూచిస్తారు.

## భూసార పరీక్షలతో లాభాలు..

పొలాల్లోని ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు. మట్టి పరీక్షల ఫలితాలతో ఏ పంట వేయాలి. ఏ పంటకు ఏయే ఎరువులు ఏ మోతాదులో వేయాలి. అనే విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది.పంట పొలాల్లో చౌడ ఆమ్లస్థాయిని నిర్ధారించి వాటిని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించే అవకాశం ఉంటుంది. రసాయన ఎరువులపై అనవసర ఖర్చును తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

## 20 నుంచి 30 రోజుల్లో ఫలితాలు..

భూసార పరీక్షకు సేకరించిన మట్టిని వ్యవసాయాధికారులు పరీక్షా కేంద్రాలకు పంపుతారు. అధికారులు పంపిన తర్వాత ఇరవై నుంచి ముప్పై రోజుల్లో ఫలితాలను ఆన్‌లైన్‌లో అందజేస్తారు. దీంతోపాటు రైతుకు భూసార పరీక్షలకు సంబంధించిన ఆరోగ్యకార్డును అందజేస్తారు. ప్రస్తుతం భూసార పరీక్షల మట్టిని సేకరించి అందిస్తే కనీసం నెలరోజుల వరకు ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఏటా సగం రైతులకు సంబంధించిన భూసార పరీక్షలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే సగం మంది రైతులకు చెందని భూసార పరీక్షలు పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు.

## భూసార పరీక్షలు తప్పనిసరి

రైతులు భూసార పరీక్షలు చేయించుని తమ వ్యవసాయ పొలాల్లో అనుకూలమైన పంటలను సాగుచేసుకునేందుకు వీలుంటుంది. అదేవిధంగా అధిక దిగుబడులు సాధించేందుకు సులువుగా ఉంటుంది. భూ సారాన్ని బట్టి ఎంతమేరకు ఎరువులను వాడవచ్చునేది తెలిస్తుంది. ప్రస్తుతం రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ పొలాల్లో ఏయేపంటలు సాగుచేసుకుంటే బాగుంటుందో తెలుసుకునేందుకు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. రైతులు భూసార పరీక్షలు చేయించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు.



# నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో.. తిప్పర్తి మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు



**తిప్పర్తి అక్టోబర్ 05 అక్షర కలం :**

ఈ సమావేశంలో కంచర్ల మాట్లాడుతూ.. ప్రజల కోసం పార్టీ కోసం నమ్మకంగా పనిచేసే సమర్థులైన వ్యక్తులను పార్టీ అభ్యర్థులుగా... సూచించాలని, ఈ సందర్భంగా హాజరైన కార్యకర్తలను నాయకులను కోరారు.. గతంలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవని, వారిని నమ్మి పార్టీ చేతుల్లో పెడితే తీరా అసెంబ్లీ ఎన్నిక సమయంలో వెన్నుపోటు పొడిచి పార్టీకి ద్రోహం చేశారని. ఈసారి అలా మోసపోకుండా పార్టీ నమ్మకమైన వ్యక్తులను అభ్యర్థులుగా నియమించుకోవాలని కోరారు. సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల్లో చులకన అయిందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.. ఇంకా ఈ సమావేశంలో... నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి తండు సైదులు గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు లొడంగి గోవర్ధన్, గోదావరి గూడెం మాజీ ఎంపీటీసీ ఊట్కూరు సందీప్ రెడ్డి, తండు నరసింహ,, కందుల లక్ష్మయ్య, రైతు బంధు కమిటీ జిల్లా కమిటీ మాజీ సభ్యురాలు వనపర్తి జ్యోతి మహిళా అధ్యక్షురాలు కోట్రస్వరూప కంచర్ల విజయ, కొమ్ముగిరి, తదితరులతో పాటు భారీ ఎత్తున మండల ముఖ్య నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా అలాయ్ బలాయ్ కార్యక్రమం



**చిట్యాల : అక్షర కలం, ప్రతినిధి**

నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా అలాయ్ బలాయ్ (ఆత్మీయ ఆలింగనం) కార్యక్రమం చిట్యాల మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. మిత్ర బృందం లో పోకల దేవదాస్, మారుగోని ఆంజనేయులు గౌడ్, వనం వెంకటేశ్వర్లు, పొన్నం లక్ష్మయ్య, నారా బోయిన శ్రీనివాస్, బొబ్బలి రామ్ రెడ్డి, కలిసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వకాలంలో దసరా పండుగ వచ్చిందంటే గ్రామాలలోని కుల మతాలకు అతీతంగా, అలాయి బలాయి కార్యక్రమాన్ని నిర్వహించుకునే వారని తెలియజేశారు. మన పూర్వ సంస్కృతిని సాంప్రదాయాలను కంప్యూటర్ యుగంలో కనుమరుగు అవుతున్న తరుణంలో ఇటువంటి సాంప్రదాయాలను ముందు తరాలకు తెలియజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియజేశారు.

# బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షులుగా సుక్క శ్రీకాంత్

**వలిగొండ అక్టోబర్ 05 అక్షరకలం:**



బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) వలిగొండ మండల అధ్యక్షునిగా సుక్క శ్రీకాంత్ ను రెండవసారి నియమిస్తున్నట్లుగా జిల్లా అధ్యక్షులు గంధమల్ల లింగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా ఎన్నికైన సుక్క శ్రీకాంత్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ నిర్మాణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వలిగొండ మండల అధ్యక్షునిగా రెండవ నియమించినందుకు జిల్లా అధ్యక్షులు గంధమల లింగస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిఎస్పి పార్టీ తరఫున అన్ని స్థానాల్లో పోటీకి నిలిపి బలాన్ని నిరూపించాలని దీనికోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

# రాష్ట్రియా స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యం లో భారీ ర్యాలీ.

**అక్షర కలం, కొండమల్లేపల్లి.**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పరమ పూజనీయ డాక్టర్ కేశవరావు బలి రామ్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయం సేవ సంఘాన్ని 1925 లో విజయదశమి పర్వదినాన స్థాపించారు సమరసతతొ కూడిన సంఘటిత భారత నిర్మాణంలో నిమగ్నమైన సంఘం విజయదశమికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నశుభ తరుణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఆత్మీయ హిందూ బంధువులకు ఎర్ర నర్సింగ్ తెలంగాణ ప్రాంత సహ కార్యవాహ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి హిందువు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు ఇట్టి కార్యక్రమానికి నా రెడ్డి రవీందర్ రెడ్డి భవదీయ ఖండ కారి వాహ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి పద సంచనలో పాల్గొని హిందువులను ఉద్దేశించి హిందువులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు



# ప్రజాసమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించండి...

**బలమైన అన్ని స్థానాల్లో పోటీ చేస్తాము.....**

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ...**

**నాగార్జున సాగర్, అక్షర కలం ప్రతినిధి:**



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారంనాడు పెద్దవూర మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం దోరేపల్లి మల్లయ్యఅధ్యక్షతన సమావేశం.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల తరఫున నిబద్ధతతో పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పాలక రాజకీయ పార్టీలు డబ్బు సంచులతో మందు బాటిల్లతో కులం మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ఓట్లు దండుకొని ప్రజా సమస్యలను ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. అలాంటి రాజకీయ పార్టీలకు ఓట్లు వేయకుండా తిరస్కరించాలని ప్రజలను కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాన్ని అడ్డం పెట్టుకొని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుందని మతం మైకంలో ప్రజలనుంచి దేశ సంపదను బడా కార్పొరేట్లకు దోచిపెడుతుందని రాష్టంలో బిజేపీని తరిమికొట్టాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే రైతుల భూమి తీసుకోవాలని బలవంతంగా ప్రయత్నిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, మండల నాయకులు ఎస్ కె బషీర్,దుబ్బ ఏడుకొండలు, మాగ్దూం మొహిద్దిన్,దేశ్యానాయక్, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నరు.

# సినర్జీ ఉత్పత్తులతో ఫామాయిల్ మంచి దిగుబడి

**ఫామాయిల్ రైతులకు సినర్జీ ఒక భరోసా**

**భూమి, పంట, తెగుళ్లకు సినర్జీ ఒక పరిష్కారం**

**సినర్జీ రీజనల్ మేనేజర్ యరమల వీరమోహన్ రెడ్డి**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం : సినర్జీ ఉత్పత్తుల ద్వారా ఫామాయిల్ రైతులకు మంచి దిగుబడి వస్తోందని, గత 16 సంవత్సరాలుగా ఫామాయిల్ రైతులకు సినర్జీ ఆత్మ విశ్వాసంతో కూడిన ఆర్థిక భరోసా కల్పిస్తూ వస్తుందని సినర్జీ రీజనల్ మేనేజర్ యరమల వీరమోహన్ రెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని స్వర్ణ భారతి కళ్యాణ మండపంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఫామాయిల్ రైతులు పాల్గొని "సీనర్జీ క్రాప్ ప్రొటెక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్" వారి ద్వారా మంచి దిగుబడికి కావలసిన సూచనలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ యరమల వీరమోహన్ రెడ్డి మాట్లాడుతూ... సినర్జీ గ్రూపు స్థాపించి 16 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. దాదాపు 150 రకాల మందులు రైతుకు ఉపయోగపడే విధంగా నాణ్యతకు ఏ మాత్రం తీసిపోకుండా సహకారం అందిస్తుందన్నారు. ఫామాయిల్ పంటకు పురుగు మందులు, తెగుళ్ల మందులు, కలుపు మందులు, సూక్ష్మ పోషక పదార్థాలు, స్థూల పోషక పదార్థాలు, నేలలో వేయుటకు కావలసిన వాటర్ సొల్యూషన్స్ తో పంటకు ఏ తెగులు వచ్చిన మందులు ఉన్నాయని, రైతులకు నమ్మకమైన సర్వీస్ అందిస్తామని తెలిపారు. భూమి ఆరోగ్యంగా ఉండాలంటే భూమిలోపల సూక్ష్మ జీవులు పుష్కలంగా ఉండాలని, అవి ఉండాలంటే సముద్రపు నాచుతో తయారైన సి వీడ్ గ్రాన్యూల్స్ సిన్ జైమ్ వాడాలని, వామ్ టెక్నాలజీతో తయారైన మనిగోల్డ్ వాడాలని తెలిపారు. అదేవిధంగా పంటలు ఆరోగ్యంగా ఉండాలంటే మైక్రో న్యూట్రిఎంట్ వాడే అవశ్యకత ఉందని ముఖ్యంగా ఎఫ్ 7, ఎఫ్6, ఎఫ్4 తప్పనిసరిగా పంట కీలక దశలలో వాడాలని నొక్కి చెప్పారు. సినర్జీ కంపెనీ రైతుల సంక్షేమం పరమావధిగా భావించి రైతు సదస్సులలో రైతులకు తెలియజేస్తున్నామని అన్నారు. సినర్జీ క్వాలిటీ కి ప్రాధాన్యతనిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సినర్జీ డెవలప్మెంట్ మేనేజర్ కట్ట వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఏరియా మేనేజర్ అభిమల్ల నాగేశ్వరరావు, సేల్స్ ఆఫీసర్స్ ఎస్.కె నాగుల్ మీరా, జి. ప్రతాప్, టి. సంతోష్, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సైనికులంతా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి... మాజీ ఎమ్మెల్యే నోముల భగత్.

మాడుగుల పల్లి మండలం, ఇందుగుల గ్రామం, %ఎఎ=% ఫంక్షన్ హాల్ లో స్థానిక సంస్థల ఎన్నికల పై ఆదివారం నాడు మాడుగుల పల్లి మండలం లోని ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ నల్లమోతు భాస్కర్ రావు , కంచర్ల భూపాల్ రెడ్డి . అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతును రాజుగా చేయాలని తపనతో రైతులను గుండెల్లో పెట్టుకొని చూసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాపాడుకున్నారనీ ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడం లేదని,రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదని, రైతుబంధు, రైతు బీమా విషయంలోనూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో గ్రామం నుంచి బిఆర్ఎస్ సైనికులంతా కలిసి ఓకే అభ్యర్థిని సూచించాలని ,అభ్యర్థి కోసం అహర్నిశలు కష్టపడి గెలిపించుకోవాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో "కాంగ్రెస్ బాకీ కార్డే" మన బ్రహ్మాస్త్రం అని ,బాకీ కార్డును ఇంటింటికి



అందచేసి.కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు పగిల్ల సైదులు, యాదగిరి రెడ్డి, ఖాసిం, కృష్ణయ్య, జనార్ధన్, రాములు, సన్నాల నాగరాజు, తవిటి సైదులు, గొడుగు రమేష్, కన్నెబోయిన నాగరాజు, దర్శనం నాగయ్య, పూసలపాడు జలంధర్, మేకల నరేష్, బంగారపు రవి, డాకయ్య, కొండేటి కెప్టెన్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..


# సాగర్ డ్యాం కు తగ్గిన వరద ప్రవాహం..

**నాగార్జునసాగరు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు మూసివేత...**

**ప్రాజెక్టు జలవిద్యుత్ కుడి,ఎడమ కాలువ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల**

**నాగార్జునసాగర్ ప్రతినిధి...**

నాగార్జునసాగర్ జలాశయానికి స్వల్పంగా వరద నీరు,తగ్గడంతో ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం సాయంత్రము క్రస్ట్ గేట్లను మూసివేశారు,ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రాల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది,ఈ నేపథ్యంలో సాగర్ ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 55,131,క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది,సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్,కుడి,ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నాయి.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులుకాగా ప్రస్తుత నీటిమట్టం587.50,అడుగులుగా ఉంది.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 305.8030, టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిలువ ఉంది,కుడి కాల్వ ద్వారా 10,040,క్యూసెక్కులుఎడమ కాల్వ ద్వారా 8,896,క్యూసెక్కులు,మెయిన్ పవర్ హౌస్ ద్వారా 33,495, క్యూసెక్కులు ఎస్ఎల్బీసీ ద్వారా 2400, క్యూసెక్కులు వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు,నీటి విడుదల కొనసాగు తుంది,ప్రాజెక్ట్ నుంచి పూర్తిస్థాయి నీటి విడుదల 55,131 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవు తుంది.



# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

సూర్యాపేట(సిటీ) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఇండియన్ క్రికెటర్, చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్ అన్నారు.

సూర్యాపేట, అక్టోబర్ 05 అక్షర కలం :

ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డు క్రికెట్ గ్రౌండ్లో ఎంఎస్కే ప్రసాద్ ఇంటర్నేషన్ క్రికెట్ అకాడమీ సూర్యాపేట ఆధ్వర్యంలో ఎంఎస్కే ఐసీఏ అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్ను గత పది రోజుల పాటు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులు అందించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు శారీరక ధారుడ్యం, మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఫ్రీడమ్ క్రికెట్ అకాడమీ నల్లగొండ వారికి ప్రథమ స్థానం లభించగా ఎంఎస్కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ సూర్యాపేట వారు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. బెస్ట్ బ్యాట్ మెన్గా డి విష్ణు, బెస్ట్ బౌలర్గా రోషన్, ఎంవీపీ ఆజాం, బెస్ట్ ఫీల్డర్ అఖిలేష్ యాదవ్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్జున్ అవార్డు గ్రహిత నాగపురి రమేష్, నల్లగొండ జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీన్ బాబా, డాక్టర్ సందీప్, మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ భరత్, హెడ్ కోచ్ ఉస్మద్ తదితరులు పాల్గొన్నారు.



# సమాజ సేవ నే దేశసేవ : చిట్యాల ఆర్ఎస్ఎస్



ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావన రాష్ట్రీయ స్వయం సేవక్ మూలసూత్రమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ నల్గొండ విభాగ ప్రచారక్ కాచం సత్యనారాయణ అన్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో ఆదివారం రోజున రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ. 1925లో నాగపూర్‌లో డా. కేశవ్ బాలిరాం హెడ్గేవార్ స్థాపించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేటికి నూటేళ్ల పూర్తిచేసుకుని%ఎ% విజయయాత్ర సాగిస్తుందని అన్నారు. వంద సంవత్సరాల నుండి లక్షలాది స్వయంసేవకులను తీర్చిదిద్దిందని అన్నారు. ప్రతిరోజూ జరిగే శాఖల ద్వారా యువతలో దేశ సేవా కోసం చైతన్యం నింపుతుందని ,సమాజ సేవే దేశ సేవ" నినాదంతో ముందుకు సాగుతుందని, దేశ నిర్మాణంలో రాష్ట్రీయ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి మర్రి ప్రతాపరెడ్డి, గ్రామంలోని , స్వయం సేవకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నుండి కొల్చారం జడ్పిటిసి రేసులో కోనాపూర్ సంతోష్ రావు....












## - యువకులతో కలగోలుపుగా ఉండే నాయకుడు...

కొల్చారం, అక్టోబర్ 05 (అక్షర కలం):-

మెదక్ జిల్లా కొల్చారం మండలం జడ్పిటిసి రేసులో కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ నుండి జడ్పిటిసి రేసులో ఉన్నారు. యువకులతో కలగలుపుగా ఉండే యువ నాయకుడు సంతోష్ రావు దీపావళి దసరా పండగల వస్తే విద్యార్థులకు సెలవులు వస్తే చాలు. ఆయన చేసే కార్యక్రమాలు యువకులు ఉత్సాహంగా ఉండాలని ఉద్దేశంతో కొన్ని గ్రామాలలో ఆట పోటీలు నిర్వహించేవాడు. కొల్చారం మండలంలోని రంగంపేట, కోనాపూర్ వివిధ గ్రామాలలో కబడ్డీ కోకో వాలీబాల్ ఆటో పోటీలను నిర్వహించారు. క్రికెట్ మ్యాచ్ లో కూడా కిట్లు పంపిణీ చేసిన కోనాపూర్ సంతోష్ రావు వైపే యువకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనాప్పటికీ మాకు క్రీడాల్లు ఉత్సాహాన్నింపిన యువ నాయకుడు సంతోష్ రావు జెడ్పిటిసి నిలబడితే అతని గెలుపు గెలుపుచుకునే బాధ్యత మాపై ఉందని వివిధ గ్రామాల ఈ యువకులు అంటున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండి..పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలనీ పిలుపునిచ్చిన ం- మాజీ నల్లమోతు భాస్కర్ రావు గారు..







మిర్యాలగూడ, అక్టోబర్ 05 అక్షర కలం :

ఈ రోజు మిర్యాలగూడ టౌన్ రెడ్డికాలనీ బారాస పార్టీ కార్యాలయములో అడవిదేవులపల్లి మండల పార్టీ ఆధ్వర్యములో విస్తృత స్థాయి సమావేశము నిర్వహించారు.. ఇట్టి సమావేశానికి మిర్యాలగూడ మాజీ %మీూా% లు నల్లమోతు భాస్కర్ రావు గారు, గారు హాజరై అడవిదేవులపల్లి మండల,గ్రామ కమిటి కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు.. ఈ సందర్భంగా భాస్కర్ రావు గారు మాట్లాడుతూ పార్టీ తరపున ఎవరినీ అభ్యర్ధిగా నియమించిన అందరూ సమిష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్ధిని గెలిపించాలని తెలిపారు.. ఈ ఎన్నికల నుంచి గ్రామా , మండల స్థాయిలో ఎటువంటి గ్రూపు, వర్గాలు లేకుండా పనిచేసి అత్యదిక సంఖ్యలో మన పార్టీ అభ్యర్థులు విజేతలు అవ్వడానికి కష్టపడాలని, ఎలాగు అధికార కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు తిరగపడుతున్నారు కనుక వాళ్ళు గ్రామాలలో కనపడితే నిలదీసే పరిస్థితి ఉంది, ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వానికి తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.. అనంతరం %దీ=ూ% వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవ %ఖు=% గారు కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేసిన విషయం తెలిసిందే, ఈ సమావేశములో భాస్కర్ రావు గారు ఇట్టి కార్డును గ్రామములో అందరికి అందించాలని కోరారు..ఈ కార్యక్రమములో ధనవత్ బాలాజీ నాయక్ , కుర్ర సేవ్య, మర్రెడ్డి కుర్ర శీను, బండి వెంకటేశ్వర్లు, క్రాంతి, శ్రీను , పకీర బీమా, జైలాల్, స్వామి, తావు, దన్ సింగ్, రవి ,భాస్కర్ ,లస్కర్ ,బాబు ,వాల్య ,ముని, చిన్న నాయక్, బాలాజీ నాయక్ ,రామకోటి నాయక్, మధు, గోపాలకృష్ణ ,మల్లికార్జున, హనుమంతు, జగన్, గోన, బాబ్జాని ,కొండల్ పాల్గొన్నారు.



# హిందూ సంఘటనయే దేశానికి రక్షణ...



నల్లగొండ, అక్టోబర్ 05 అక్షర కలం ప్రతినిధి:

హిందూ సంఘటన ద్వారానే దేశం రక్షించబడుతుందని హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ ఎస్ ఎస్ కృషి చేస్తుందని ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ సంఘ చాలక్ గార్లపాటి వెంకటయ్య పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా నల్లగొండ నగర శాఖ ఆద్వర్యంలో స్థానిక మేకల అభినవ్ స్టేడియం నుండి నాగార్జున కళాశాల వరకు నల్లగొండ నగర పురవీధుల గుండా నగర స్వయంసేవకులు పద సంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు, హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని పేర్కొన్నారు, హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత,కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం మరియు పర్యావరణ పరిరక్షణ,పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని ఆర్ ఎస్ ఎస్ ఈ దేశ పరిరక్షణకు, వ్యక్తి నిర్మాణానికి, హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు అందరూ స్వాగతించాలని కోరారు. దేశ వ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆర్ ఎస్ ఎస్ ను ప్రజలకు చేరువ చేసిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సాహ సంగచాలక్ ఇటికాల కృష్ణయ్య, నగర సంఘచాలక్ దోసపాటి శ్రీనివాస్ విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ పాల్గొన్నారు.

# లంబాడీల ఆత్మగౌరమున కై లంబాడీల మహా సమ్మేళనం చలో హుస్నాబాద్ వాల్ పోస్టర్లను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో గిరిజన నాయకులు ఆవిష్కరించారు

అక్షర కలం/ ప్రతినిధి :

ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలని సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన కొంతమంది నాయకుల విధానానికి వ్యతిరేకంగా హుస్నాబాద్ తిరుమల గార్డెన్ లో లంబాడీల మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గిరిజన ఉద్యోగస్తులు, గిరిజన సంఘాల నేతలు తెలిపారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రతి గిరిజన తండా నుండి పెద్ద ఎత్తున గిరిజనులు సభకు హాజరుకావాలని కోరారు. సుప్రీంకోర్టులో వేసిన పిటీషన్ వేసిన నాయకులు బేషరతుగా తమ పిటీషన్ ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలనే అంశంపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలన్నారు. ఈ నెల 8వ తేదీ శుక్రవారం హుస్నాబాద్ లోని ఏనె అమరవీరుల స్తూపం నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా తిరుమల గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ర్యాలీ, సభలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని జాతి ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగలు బానోతు కిసన్ నాయక్, లావుడ్య బిక్షపతి, లావుడ్య రవి, గుగులోతు శంకర్ నాయక్, గుగులోతు హరియా నాయక్, గిరిజన సంఘ నాయకులు భూక్య శ్రీనివాస్ నాయక్, గుగులోతు భీమ సాయబ్, భూక్య సరోజన, గూగులోతు రాజు నాయక్ ,మాలోత్ రామచందర్ నాయక్, గుగులోతు శివరాజ్ నాయక్, భూక్య వీరన్న నాయక్ ,ధరావత్ తిరుపతి నాయక్, లకవత్ వెంకటేష్ నాయక్, మూడవ వసంత్ నాయక్, భూక్య మోతిలాల్ నాయక్ , లావుడ్య కైలు నాయక్, లావుడ్య భీఖ్య నాయక్, మాలోత్ సత్యం నాయక్ ,గూగుల్ రవి నాయక్, బానోతు భాస్కర్ నాయక్, గుగులోతు లక్పతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.





# ఎంపీ వద్దిరాజు పోరాడితేనే బీసీ రిజర్వేషన్లు సాధించుకోగలుగుతాం







**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

బీసీ కులాల వారందరం మరింత ఐకమత్యంతో పోరుసల్పితేనే న్యాయమైన హక్కులు, రాజ్యాధికారంలో సముచితమైన వాటా దక్కించుకోల్గుతామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ నందు పొందుపర్చిన తర్వాతే రిజర్వేషన్స్ పెంపుదల సాధ్యమవుతుందని తెలిసి కూడా కాంగ్రెస్ నాయకులు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు.బీసీ ప్రజా ప్రతినిధులు,కుల సంఘాల నాయకుల సమావేశం హైదరాబాద్ అశోకా హోటల్ లో ఆదివారం జరిగింది.ఈ సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీ.హనుమంతరావు,రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రులు గంగుల కమలాకర్,వీ.శ్రీనివాస్ గౌడ్,నేరెళ్ల ఆంజనేయులు,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,మాజీ ఎమ్మెల్యేలు పుట్టా మధుకర్,బొల్లం మల్లయ్య యాదవ్,బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్,బీసీ నాయకులు జనార్ధన్,గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,బీసీ రిజర్వేషన్ల అంశంలో రేపోమాపో ఏదో అద్భుతం జరుగుతుందని అనుకోవడం పొరపాటు అన్నారు.ఎన్నికలలో ఏ విధంగానైనా గెల్వాలనే కుయుక్తులతో కాంగ్రెస్ అలవికాని హామీలెన్నో ఇచ్చి ప్రజలను నమ్మించి తీరా అధికారం చేపట్టాక మోసగిస్తున్నదని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ నాయకులు పులి మీద స్వారీ చేస్తున్నారని,ఇక కిందకు దిగడమనేది చాలా కష్టంతో కూడుకున్నదన్నారు.మేం మునుపటి మాదిరి బీసీలం కాదని,దేశ కాల పరిస్థితులు అర్థం చేసుకుంటున్న తెలివైన వారమని ఎంపీ రవిచంద్ర చెప్పారు.తెలంగాణ అసెంబ్లీ తొలి సమావేశాలలోనే తమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు బీసీలు,మహిళలకు 33శాతం చొప్పున చట్టసభల్లో రిజర్వేషన్స్ ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని కేంద్రానికి గుర్తు చేస్తూ తీర్మానించి పంపడం జరిగిందన్నారు.స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42%, చట్టసభల్లో మహిళలతో పాటుగా 33% చొప్పున రిజర్వేషన్స్ సాధించుకోవాలంటే అశోకా హోటల్ లో, ఇందిరాపార్క్ వద్ద ధర్నాలతో సాధ్యపడదని,మన కార్యక్షేత్రాన్ని ఢిల్లీకి మార్చి పోరుబాట పట్టాల్సిందేనని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.రిజర్వేషన్స్ పెంపుదల, రాజ్యాధికారంలో సరైన వాటా కోసం ఢిల్లీలో పలుమార్లు జరిగిన సభలు,సమావేశాల ఏర్పాట్లను తాను దగ్గరుండి చూసుకున్నానని ఎంపీ రవిచంద్ర చెప్పారు.కాంగ్రెస్ నాయకులు ఇక్కడ ఎన్ని మాటలు చెప్పినా, కుప్పిగంతులు వేసినా ఏ మాత్రం ప్రయోజనం లేదని, పార్టీ అధినేత రాహూల్ గాంధీపై వత్తిడి పెంచి పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టించడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీకి 100 మందికి పైగా, ఇండియా కూటమికి 300 మందికి పైగా ఎంపీలు ఉన్నారని,ప్రధాని నరేంద్రమోడీని రాహూల్ గాంధీ కలిసి బిల్లు పార్లమెంటులో పెడితే బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ వద్దిరాజు చెప్పారు.దేశవ్యాప్తంగా బీసీలలో చైతన్యం పెరిగిందని బీజేపీ కూడా గుర్తించిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా చట్టసభల్లో కూడా రిజర్వేషన్స్ సాధించుకునేందుకు గాను మనమంతా మరింత సంఘటితమై కేంద్రంపై ఒత్తిడి పెంచుదామని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఈ సందర్భంగా నాయకులందరూ చేయిచేయి కలిపి అభివాదం చేశారు.”వర్థిల్లాలి వర్థిల్లాలి బీసీల ఐక్యత వర్థిల్లాలి”,”పోరాడుదాం పోరాడుదాం మన న్యాయమైన హక్కుల సాధనకు పోరాడుదాం”,”జై బీసీ జైజై బీసీ”అంటూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా....- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్....

- స్థానిక సంస్థల ఎన్నికల విధులలో అధికారులు....
- కేవలం హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే ప్రజావాణి దరఖాస్తులు స్వీకరణ....
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్....

**మెదక్, అక్టోబర్ 05( అక్షర కలం):-**



స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు జిల్లా అధికారులు అందుబాటులో ఉండరని మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా వాయిదా వేయడం జరిగిందని, కేవలం హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తామని ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని సహకరించాలన్నారు.

# ఎన్నికల లబ్దికోసమే బీజేపీ బొనాంజ






## జి.ఎస్.టి. పేరుతో 15 లక్షల కోట్ల దోపిడి, పెరుగుతున్నసాంకేతిక మాయాజాలం ప్రజల్లో బలంగా ప్రజాస్వామిక భావజాలం, సి.పి.ఐ రాష్ట్ర సమితి సమావేశంలో నారాయణ

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం: దేశంలో ఈ ఏడాది చివరిలో వచ్చే ఏడాది మొదటి త్రైమాసంలో పలు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయని ఎన్నికలలో లబ్దికోసమే బీజేపీ ఎన్నికల బొనాంజపేరుతో ఆర్థిక లబ్ది చేకూరుస్తుందని సి.పి.ఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మెన్ కె. నారాయణ ఆరోపించారు. బీహార్ సహా పలు రాష్ట్రాలలో ప్రోత్సాహాలను అందిస్తూ ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తుందని ఇందుకొరకు వేలకోట్ల రూపాయలను డంపు చేసిందని ఆయన తెలిపేరు. సి.పి.ఐ రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం ఖమ్మం సరిగమ పంక్షన్హాల్లో దండి సురేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే బీజేపీ డొల్లతనం దొంగ ఓట్లతో బయటపడిందన్నారు. బీజేపీ అంతా బాగున్నట్లు భ్రమింపచేస్తుందని వాస్తవానికి క్షేత్రస్థాయిలో బీజేపీ బలహీనపడుతుందని నారాయణ తెలిపారు. ప్రజల్లో ప్రజా స్వామ్యత భావజాలం బలంగా ఉందని బీజేపీ ప్రజా స్వామ్య వ్యతిరేక చర్యలను ప్రజలు నిరసిస్తున్నారని ఆయన తెలిపారు. జి.ఎస్.టి. తగ్గింపు వ్యవహారం కార్పోరేట్ కంపెనీల వండుగ ఆఫర్ లాంటిదని కంపెనీలు ధరపెంచి తగ్గిస్తుంటాయని జి.ఎస్.టి. తగ్గింపు కూడా అటువంటిదేనన్నారు. జి.ఎస్.టి.పేరుతో 9 ఏళ్ళ కాలం 15 లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ప్రజల నుంచి లూటీ చేసిందని నారాయణ తెలిపారు. 16 లక్షల కోట్లు దోపిడి చేసిన 29 మంది కార్పోరేట్ అధిపతులకు కేంద్రప్రభుత్వానికి పెద్ద తేడాలేదన్నారు. దేశంలో డిజిటల్ దోఫిడి పెరిగి పోతున్నదని ఎ.ఐ. మాయాజాలం పెరిగిపోతున్నదని ఆయన తెలిపారు. ఎ.ఐ పేరుతో ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించి దోపిడికి పాల్పడుతుందన్నారు. కేంద్ర ఆర్థిక మంతి నిర్మలా సీతారామన్ పేరుతోనే ఒక ప్రకటన విడుదల చేసి పందల కోట్ల రూపాయలు దోపిడి చేసేందుకు ప్రయత్నం సజరుగుతుందన్నారు. కమ్యూనిస్టులుగా ఈసాంకేతిక పరిజ్ఞానం గురించి ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మిడియాను విరివిగా వినియోగించుకోవాలని నారాయణ తెలిపారు. దేశంలో కమ్యూనిస్టులకు సామాజిక పునాది సానుకూలం కాకపోయినా కమ్యూనిస్టుల ద్వారానే సమాజ మార్పు జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్.ఎస్.ఎస్. వందేళ్ళలో దోపిడి వ్యవస్థను పదిలిం చేసిందని తన భావజాలాన్ని ప్రచారం చేస్తుందని కాని కమ్యూనిస్టుపార్టీ దోపిడి వ్యవస్థ అంతం కోసం ప్రయత్నిస్తున్నదని ఆర్.ఎస్.ఎస్. సి.పి.ఐ పర్పస్పర విరుద్ధభావాజాలం కలిగివున్నాయని ఆయన తెలిపారు. మార్పు అనివార్యమని అది కమ్యూనిస్టుల ద్వారానే జరుగుతుందన్నారు. పార్టీ శత సంవత్సరాల సంబరాల సందర్భంగా దేశవ్యాపితింగా జనసేవాదళ్ కార్యక్రమాలను విస్తృత పర్చాలని వేల మంది కార్యకర్తలను తయారు చేయాలని నారాయణ పిలుపు నిచ్చారు.

### గెలుపే లక్ష్యంగా కార్యాచరణ కూనంనేని

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అందుకనుగుణంగా పనిచేయాలని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్రసమితి సమావేశంలో ఆయన కార్యకలాపాల నివేధికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర, జాతీయ మహాసభల నిర్ణయాలను వెల్లడించిన కూనంనేని స్థానిక పరిస్థితులకనుగుణంగా ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్ళాలని సైద్దాంతిక, పార్టీ భావజాల ప్రచారం జరగాలని క్యాడర్కు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీలు ఒక్కో రకమైన సమస్యలతో రాజకీయ ఇబ్బందులెదుర్కొంటున్నాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హామీల పట్ల ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతుందని అదే సమయంలో బి.ఆర్.ఎస్.లో ఇంటిపోరు, కాళేశ్వరం తదితర అంశాలు చర్చనీయ అంశాలయ్యాయన్నారు. బీజేపీ బి.సి. రిజర్వేషన్ల విషయంలో దొంగాట అడుతున్నదని కూనంనేని ఆరోపించారు. బి.సి. రిజర్వేషన్పట్ల రాజకీయ పార్టీలు ద్వంద విధానాన్ని అవలంభిస్తున్నాయన్నారు. పార్టీ శత సంవత్సర ముగింపు చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, జాతీయ నాయకులు అజీజాపాషా, చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు టి.శ్రీనివాసరావు, ఈటి నర్సింహా, ఎం.ఎల్.సి. నెల్లకంటి సత్యం, బాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లా వెంకటరెడ్డికి ఘన సన్మానం

ఖమ్మం, 5 అక్టోబర్: సి.పి.ఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికై తొలిసారి ఖమ్మం వచ్చిన సి.పి.ఐ నాయకులు పల్లా వెంకటరెడ్డిని భారత కమ్యూనిస్టుపార్టీ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఛండీఘర్లో గత నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ మహాసభల్లో వల్లా వెంకటరెడ్డి జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శాసనసభ్యునిగా, సి.పి.ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గసభ్యులుగా గతంలో పల్లా వెంకటరెడ్డి పనిచేశారు. సన్మానించిన వారిలో సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాగం హేమంతరావు, జాతీయ సమితిసభ్యులు ఎస్.కె. సాబీర్పాషా, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్.కె. జానిమియా, ముత్యాల సత్యనారాయణ, కల్లూరి వెంకటేశ్వరరావు, ఏపూరి లతాదేవి, కొండపర్తిగోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, బి.జి. క్లైమెంట్, అజ్మీర రామ్మూర్తి, సలిగంటి శ్రీనివాస్, మున్నాలక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి!

## మోదీ పథకాలను ప్రజలకు చేరవేయండి.

## బూత్ స్థాయి నుండి విజయ యాత్ర ప్రారంభించాలి!

## జిల్లాలో అన్ని స్థానాల నుంచి బిజెపి పోటీ చేస్తుంది.

## బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు.

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**








రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తన బలాన్ని నిరూపించి, ప్రతి గ్రామంలో కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం జిల్లా బీజేపీ కార్యాలయంలో మండల, జిల్లా నాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ “కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం ప్రతి కార్యకర్త బాధ్యత. గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమవుతోంది. ఆ నిధుల విలువను ప్రజలకు తెలియజేయండి” అని పిలుపునిచ్చారు. “రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరేయడం లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంది. గ్రామీణ ప్రజలకు అందిస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయాలి” అన్నారు. “వచ్చే ఎన్నికల్లో వార్డు సభ్యుల నుండి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బీజేపీ ఆధిపత్యం సాధించాలి. కార్యకర్తలే పార్టీకి బలమని, వారి శ్రమతోనే విజయం సాధ్యమని” తెలిపారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయిలో కమిటీలను తక్షణం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. “ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో బూత్ వారీగా కార్యకర్తలను సమన్వయం చేయండి. స్థానిక నాయకులే ప్రజల విశ్వాసానికి ప్రతీక కావాలి. పార్టీ అభ్యర్థుల గెలుపు ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ విధానాలను ప్రజలకు చేరవేయడం సాధ్యమవుతుంది” అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే హామీలన్నీ విఫలమై ప్రజలను మోసం చేసింది. ఇక ప్రజలు మార్పు కోరుతున్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వం కావాలని ప్రతి కార్యకర్త హృదయపూర్వకంగా నమ్ముతూ శ్రమించాలి” అని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రధాని మోదీ ప్రభుత్వమే గ్రామీణ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తోంది. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, హర ఘర్ జల్, స్వచ్ఛ భారత్ మిషన్, పీఎం కిసాన్ వంటి పథకాలు గ్రామీణ భారతాన్ని మారుస్తున్నాయి. ఈ పథకాల ప్రభావం ఖమ్మం జిల్లాలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విజయాలను ప్రజలకు వివరించాలి” అన్నారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు బీజేపీ పోటీ చేయనుందని ఆయన ప్రకటించారు. “ఈ సారి ఖమ్మం జిల్లాలో అత్యధిక స్థానాల్లో జెండా ఎగురనుంది. ప్రజలు మార్పు కోరుతున్నారు. గ్రామాల నుంచి ప్రజాభిప్రాయం బీజేపీ వైపు మొగ్గుచూపుతోంది” అని నమ్మకం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇవి రమేష్ కన్వీనర్ గా నిర్వహించిన ఈ సమావేశంలో బీజేపీ నేతలు గంట్యాల విద్యాసాగర్, వక్కలంక సుబ్రహ్మణ్యం, సన్నీ ఉదయ ప్రతాప్, మందడపు సుబ్బారావు, నున్న రవికుమార్ , పుల్లారావు యాదవ్, డాక్టర్ శీలం పాపారావు నంబూరి రామలింగేశ్వరరావు, వీరెల్లి రాజేష్, వేల్పుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
APTELRNI No. 2009/27246

# స్థానిక సంస్థలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో దృష్ట్యా పోలీస్ గ్రీవెన్స్ డే రద్దు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్.



నల్లగొండ అక్టోబర్ 05 (అక్షర కలం) ప్రతినిధి :

స్థానిక సంస్థలు ఎన్నికలు జడ్పిటిసి,ఎంపిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ గారు ఒక ప్రకటనలో తెలిపారు।గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తర్వాత తిరిగి యధావిధిగా ప్రతి సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అందువల్ల జిల్లాలోని ప్రజలు ప్రతి సోమవారం ఫిర్యాదులను సమర్పించే నిమిత్తం జిల్లా పోలీస్ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

## దివంగత నేత , స్వర్గీయ శ్రీ జి . వెంకటస్వామి ( కాకా) జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద కాకా విగ్రహానికి పూలమాల వేసి , తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా హైదరాబాద్ అక్టోబర్ 5 సుఖేందర్ రెడ్డి నివాళులు అర్పించారు.





హైదరాబాద్, అక్టోబర్ 05 (అక్షర కలం) ప్రతినిధి :

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" పేద ప్రజల అభ్యున్నతి కోసం జి. వెంకటస్వామి గారు ఎంతో కృషి చేశారని ఆయన తెలిపారు. కార్యకర్త స్థాయి నుండి ఎదిగిన ఆయన జీవితం అందరికి ఆదర్శనియమని ఆయన చెప్పారు . రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాల్లో కీలక పదవులు చేపట్టిన ఆయన ఆ పదవులకే వన్నె తెచ్చారని వివరించారు. కాకా గారి ఆశయాలకు అనుగుణంగా ఆయన కుమారులు వినోద్ , వివేక్ మనవడు వంశీకృష్ణ గార్లు ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి అభినందించారు.

## చిట్యాల లో ఘోర రోడ్డు ప్రమాదం

చిట్యాల :అక్షర కలం ప్రతినిధి

నల్గొండ జిల్లా చిట్యాల మండలం కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల పట్టణ కేంద్రంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న ఆరెంజ్ ట్రావెల్ బస్సు వెనకాల కె.వి.ఆర్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ కారును ఢీ కొట్టింది. కారును ఢీకొట్టడంతో ఆ కారు ముందు వెళుతున్న ఆరెంజ్ ట్రావెల్ బస్సు వెనకాల నుంచి ఢీకొట్టడంతో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నార్కట్ పల్లి కామినేని ఆసుపత్రికి తరలించామని తెలియజేశారు. క్షతగాత్రులలో గొర్రె జోష్ కుమార్, చల్లా శ్రీహర్ష, పైలా మురళి ఉన్నారు మురళి తండ్రి పాండురంగారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు.



# 6.5 కిలోల అండాశయ ట్యూమర్ విజయవంతంగా తొలగింపు... రాజేశ్వరి హాస్పిటల్, నల్గొండ





నల్లగొండ, అక్టోబర్ 05 (అక్షర కలం) ప్రతినిధి :

నల్గొండలోని రాజేశ్వరి హాస్పిటల్ లో మరో విశేష విజయాన్ని నమోదు చేశారు. అడవిదేవరపల్లి గ్రామానికి చెందిన 55 ఏళ్ల శ్రీమతి సరోజ (పేరు మార్చబడింది) అండాశయంలో ఏర్పడిన 6.5 కిలోల భారీ ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించారు.ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను డా. రాజేశ్వరి ప్రవీణ్, గైనకాలజిస్ట్ మరియు లాపరస్కోపిక్ సర్జన్ నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించారు. సరోజ కొంతకాలంగా కడుపు ఉబ్బరం, ఊపిరి ఆడకపోవడం మరియు అసౌకర్యం ఉండటంతో పరీక్షలు చేయగా, అండాశయంలో పెద్ద ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది.శస్త్రచికిత్స బృందంలో డా. రాజేశ్వరి ప్రవీణ్, డా. వేణు (అనస్థటిస్ట్) మరియు డా. చారి (అసిస్టెంట్) ఉన్నారు. 6.5 కిలోల బరువున్న ట్యూమర్‌ను జాగ్రత్తగా పూర్తిగా తొలగించారు. శస్త్రచికిత్స విజయవంతంగా ముగిసింది. శస్త్రచికిత్స తర్వాత సరోజ బాగా కోలుకుంటున్నారుఈ విజయవంతమైన శస్త్రచికిత్సకు సహకరించిన ఆపరేషన్ థియేటర్ మరియు నర్సింగ్ సిబ్బంది ౨ శ్రీమతి స్వప్న, విజయ, హైమ, ఉష, సనా, శ్రీదేవి, రమేష్, అయ్యాస్, విమల, లక్ష్మమ్మ, రాములమ్మ, ఫాతిమా, జహీరా ౨ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.
డా. రాజేశ్వరి ప్రవీణ్ మాట్లాడుతూ,అండాశయ ట్యూమర్లు చాలా కాలం మౌనంగా పెరుగుతుంటాయి. సమయానికి గుర్తించడం, సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చు. ప్రతి మహిళా నిరంతర గైనకాలజీ చెకప్ చేయించుకోవాలి ."

## దారిని ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.





నల్లగొండ అక్టోబర్ 5 అక్షర కలం ప్రతినిధి :

నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్లో గల చిత్ర ఎలక్ట్రానిక్స్ పక్కన ఉన్న దారిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకొని రహదారిని కాపాడాలని ఆ ప్రాంతానికి చెందిన ఇడుకుల్ల ప్రభాకర్, మంజుల , గట్టు శ్రీధర్ తడకమళ్ళ శ్యామ్, వనమా వాసు కోరారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత 70 ఏళ్లుగా ప్రజలు నడుస్తున్న దారిని జయప్రకాష్ అనే వ్యక్తి ఆక్రమించుకోవడంతో ప్రశ్నించిన తమను బూతు మాటలతో తిట్టడంతోపాటు దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిలో ఉన్న డ్రైనేజీని సైతం ధ్వంసం చేసి ఆక్రమించుకున్నాడని వారు పేర్కొన్నారు. రాజకీయ నాయకుల అండతో తమపై ఇస్తారాజ్యం గా దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి దారిని కాపాడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా స్వతంత్ర సమరయోధులకు ఘన నివాళులు

అక్షర కలం /భద్రాచలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం స్థానిక జూనియర్ కాలేజ్ సెంటర్ నందు ఓం శ్రీ సాయి యూత్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ. మాజీ భారత ప్రధాని. భారతరత్న లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలనుసంఘసభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీజీ. లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు తదుపరి అంగన్వాడి స్కూల్ పిల్లలకు పలకలు. బలపాలు. మిఠాయిలు పంపిణీ జరిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి నారాయణ. మాన్సింగ్ ఆంజనేయ శాస్త్రి. జగన్మోహన్. సాయి బోయిన శ్రీనివాస్ పాండవుల చిన్నారావు పి.శ్రీనివాసరావు ఆకునూరి నాగు అంగన్వాడి మేడం సావిత్రి. జయంతి. ఆర్ఎంపీ. అనంత్. లోహిత. సింధు. మొదలైన వారు పాల్గొన్నారు.



## సాయి మందిరంలో పుణ్య తిథి వేడుకలు





అక్షర కలం/ భద్రాచలం

జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీసాయిబాబావారిమందిరంలోవిజయదశమివేడుకలుఘనంగానిర్వహించామని అధ్యక్షులు కొమ్మనాపల్లి ఆదినారాయణ తెలిపారు. శ్రీ షిరిడి సాయిబాబా వారు మహా సమాధి పొందిన రోజు సందర్భంగా విజయదశమి నాడు ఉదయం బాబాకు పాలతో అభిషేకం తదుపరి స్వర్ణ ఆభరణాలుఅలంకరించిహారతి పాడారు. పుష్పాలతో బాబా సమాధి అలంకరణఏర్పాటుచేశారు.అష్టోత్తర నామార్చ న జరిపారు. భద్రాచలం వాస్తవ్యులు దుద్దుకూరి శివకేశవరావు సునీతా దంపతులు విజయదశమి రోజు పూలఅలంకరణ కు మరియు అన్నప్రసాదమునకులక్ష రూపాయలు విరాళం అందించారు మధ్యాహ్నం పద్నాలుగు మంది బాబా అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అబ్బి నేని శ్రీనివాసరావు కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షులు టు కొమ్మనపల్లి వెంకటరమణ మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వట్టిమర్తిలో ఉచిత కంటి శిబిరం




చిట్యాల : అక్షర కలం, ప్రతినిధి

నల్గొండ జిల్లా చిట్యాల మండల పరిధిలో ఉన్న వట్టిమర్తి గ్రామంలోనీ అక్టోబర్ 9న వరల్డ్ సైట్ డే సందర్భంగా ముందస్తుగా ప్రాథమిక పాఠశాలలో ఎల్ . వీ ప్రసాద్ హైదరాబాద్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం రోజున నిర్వహించారు. వట్టిమర్తి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ( 1994-95) చదువుకున్న పూర్వ విద్యార్థుల సహకారంతో ఈ ఉచిత కంటి శిబిరాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఉన్న వృద్ధులకు, యువకులకు, గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు చేసి కంటి చూపు తగ్గకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసిన డాక్టర్లు మాట్లాడుతూ మానవ శరీరంలో కళ్ళు అనేవి ఎంతో ముఖ్యమైన జ్ఞానేంద్రియమని, చూపు మందగించినప్పుడు డాక్టర్ సలహా తీసుకొని వాటిని కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి క్యాంపు డాక్టర్ నర్రా సురేందర్ రెడ్డి, బూర్గు.వెంకన్న, నర్రా. భిక్షం రెడ్డి, మేడి. నర్సింహ, కొమిరెల్లి. శ్రీనివాస్ రెడ్డి, రాచకొండ. రఘు తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండలో గ్యాస్ సిలిండర్లు పట్టివేత

వలిగొండ అక్టోబర్ 05 అక్షరకలం:నిబంధనలకు విరుద్ధంగా గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న స్వాతి కిరణం షాప్ లో ఆదివారం ఎస్వోటి పోలీసులు తనిఖీలు నిర్వహించి గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే వలిగొండ మండల కేంద్రంలోని స్వాతి కిరణం షాప్ లో అక్రమంగా సిలిండర్లను నిల్వచేసి అవసరమైన వారికి రెట్టింపు ధరలో విక్రయిస్తున్నారు.దీనిపై సమాచారం



అందుకున్న ఎస్ఓటీ పోలీసులు,కిరాణా షాపు లో సబ్సిడీ గ్యాస్ లు వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి అక్కడ వినియోగంలో ఉన్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని షాపు యజమానిపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులకు అప్పజెప్పారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955